TGTEL/25/A0977

# తొవ్వ

స్వాగతం

సామాన్యుని ఆవేదనకు అక్షర రూపమే నా తొవ్వకు స్ఫూర్తి

సంపుటి : 1 | సంచిక : 82 | బుధవారం 19-11-2025 | ఎడిటర్ : ముఖేష్ వీరంటి | పేజీలు: 5 | వెల : 5 రూ/.

## శబరిమలకు పోటెత్తిన అయ్యప్పలు

### దాదాపు రెండులక్షల మంది రాక

**తిరువనంతపురం,నవంబర్18:** మండల- మకరవిళక్కు వార్షిక తీర్థయాత్ర నేపథ్యంలో కేరళలోని శబరిమల అయ్యప్ప క్షేత్రానికి భక్తులు పోటెత్తుతున్నారు. తొలి రెండు రోజుల్లోనే దాదాపు రెండు లక్షల మందికి పైగా చేరుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. పంబ నుంచి సన్నిధానం మార్గంలోనూ విపరీతమైన రద్దీ నెలకొంది. చాలామంది బారికేడ్లను ఎక్కుతూ కనిపించారు. రద్దీ నియంత్రణ విషయంలో దేవస్థానం బోర్డు, ప్రభుత్వం వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోందనే ఆరోపణలు వెల్లువెత్తాయి. భక్తుల రద్దీకి సరిపడా ఏర్పాట్లు చేయలేదని ఆలయ బోర్డు ట్రస్టు, ప్రభుత్వంపై విమర్శలు వస్తున్నాయి. దీంతో దర్శనం కోసం భక్తులు గంటలతరబడి నిలబడాల్సి వచ్చింది. ఆలయ ప్రాంగణం, పంబ నుంచి నడక మార్గంలో ఇసుకేస్తే రాలనంత భక్తజనం ఉండటంతో.. ట్రావెన్‌కోర్ దేవస్థానం బోర్డు సిబ్బంది, పోలీసులకు రద్దీ నియంత్రణ తలకు మించిన భారంగా మారింది. దర్శనం చేసుకుని వచ్చే భక్తులకు ఆ మార్గంలో ట్రాక్టర్లు, జేసీబీల రాకపోకలతో ఇబ్బందులు తప్పలేదు.

## తెలంగాణ మహిళలకు కోటి చీరలు పంపిణీ

### నేటి నుంచి రెండు విడతలుగా కార్యక్రమం

### అధికారులతో సమీక్షించిన సిఎం రేవంత్

**హైదరాబాద్,నవంబర్18:** తెలంగాణలోని మహిళలకు కోటి చీరలు పంపిణీ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్దం అయ్యింది. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం ప్రారంభించనున్నట్లు మంత్రి సీతక్క వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా మహిళల సాధికారత కోసం తెలంగాణ ప్రభుత్వం కోటి మహిళా శక్తి చీరలు పంపిణీ చేస్తోందని చెప్పారు. సమాజంలో మహిళల గౌరవం, ఆత్మవిశ్వాసం పెంపొందించే దిశగా ప్రభుత్వం తీసుకున్న ప్రగతిశీల పథకం ఇదని వెల్లడించారు. బుధవారం నవంబర్ 19 నుంచి డిసెంబర్ 9 వరకు గ్రామీణ ప్రాంతాల్లో మొదటి విడతగా, మార్చి 1 నుంచి 8 వరకు రెండో విడతగా పట్టణాల్లో చీరల పంపిణీ జరగనుంది. మహిళలకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న కానుక ఇది అని మంత్రి పేర్కొన్నారు. మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రంలో కోటి మంది మహిళలకు కోటి చీరల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం లాంఛనంగా ప్రారంభించనున్నారు.

# మావోయిస్టులకు మరో ఎదురుదెబ్బ

### ఎన్‌కౌంటర్‌లో పార్టీ అగ్రనేత హిడ్మా హతం

### ఎదురుకాల్పుల్లో మొత్తం ఆరుగురు మావోల హతం



**మారేడుమిల్లి,నవంబర్18 :** మావోయిస్ట్ పార్టీకి భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే అనేకమంది లొగిపోగా, పలువురు అగ్రేతలు పోలీస్ తూటాలకు బలయ్యారు. తాజాగా మరో అగ్రనేత హిడ్మా సైతం నేలకొరిగాడు. వచ్చే మార్చి లోగా నక్సల్స్‌ను అంతం చేస్తామన్న కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రకటనకుఅనుగుణంగా ఆపరేషన్ కగార్‌తో బలగాలు దూసుకు పోతున్నాయి. తాజాగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎదురుకాల్పులు జరిగాయి. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో భద్రతా బలగాలు-మావోయిస్టుల మధ్య ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఆరుగురు మావోయిస్టులు మృతిచెందారు. మృతుల్లో మోస్ట్‌వాంటెడ్ మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు మద్వి హిడ్మా, ఆయన భార్య రాజే, అనుచరులు మల్లా, దేవే, చెల్లూరి నారాయణ అలియాస్ సురేశ్, టెక్ శంకర్ ఉన్నారు. హిడ్మాపై కోటి, ఆయన భార్యపై 50 లక్షల రివార్డు ఉన్నాయి. మంగళవారం ఉదయం 6 గంటల నుంచి ఆ ప్రాంతంలో భద్రతా బలగాల కూంబింగ్ కొనసాగుతున్నట్లు ఏపీ డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా తెలిపారు. ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా సరిహద్దు ప్రాంతాల్లో మావోయిస్టుల కదలికలపై సమాచారం నేపథ్యంలో కూంబింగ్ నిర్వహించినట్లు చెప్పారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూర్వాటి గ్రామంలో జన్మించిన మద్వి హిడ్మా.. బస్తర్ ప్రాంతంలో దళంలో కీలక సభ్యుడిగా ఎదిగారు. చిన్నవయసులోనే మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడయ్యారు. గెరిల్లా దాడుల వ్యూహకర్తగా పేరుపొందారు. పీపుల్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ కమాండర్‌గా, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగానూ పనిచేశారు. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలోనూ ఎదురుకాల్పులు జరిగాయి. మంగళవారం ఉదయం ఎర్రబోరు ప్రాంతంలో మావోయిస్టులు-భద్రతా బలగాల మధ్య జరిగిన కాల్పుల్లో ఓ మావోయిస్టు మృతిచెందాడు. ఆ ప్రాంతంలో ఎదురుకాల్పులు కొనసాగుతున్నట్లు జిల్లా ఎస్పీ కిరణ్ చవాన్ తెలిపారు. ఈ క్రమంలో అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగింది. మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో అగ్రనేత మద్వి హిడ్మా మృతి చెందారు. హిడ్మాతో పాటు ఆయన భార్య, అనుచరులతో కలిపి మొత్తం ఆరుగురు ఈ ఎన్‌కౌంటర్‌లో ప్రాణాలు కోల్పోయారు. హిడ్మా ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పర్వతి గ్రామానికి చెందిన స్థానిక మూరియా తెగకు చెందిన వ్యక్తి . 1981వ సంవత్సరంలో జన్మించిన హిడ్మా 10వ తరగతి వరకు మాత్రమే చదువుకున్నాడు. 2000 ప్రారంభంలో మావోయిస్ట్ ఉద్యమంలో చేరి, క్రమంగా అగ్రస్థానానికి ఎదిగాడు. ప్రస్తుతం సీపీఐ (మావోయిస్ట్), పీఎల్‌జీఏ బెటాలియన్ 1 కమాండర్‌గా దండకారణ్య ప్రాంతంలో (ఛత్తీస్‌గఢ్, బీజాపూర్, దంతేవాడ ప్రాంతాలు) పనిచేస్తున్నాడు. 2010లో జరిగిన దంతేవాడ దాడి (76 సీర్పీఎఫ్ సిబ్బంది హతం), 2013 జీరామ్ ఘాటి నరమేధం వంటి పలు పెద్ద దాడుల్లో ప్రధాన సూత్రధారి హిడ్మా అని ఆరోపణలు ఉన్నాయి. ఏడాది హిడ్మా సీపీఐ (మావోయిస్ట్) దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సెక్రటరీగా పదోన్నతి పొందినట్లు పోలీసుల వద్ద సమాచారం ఉంది. హిడ్మాను పట్టుకోవడం కోసం పోలీసులు ఎంతగానో ప్రయత్నిస్తున్నారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి బహుమతులు కూడా ప్రకటించారు. అడవుల భౌగోళిక పరిజ్ఞానం, గెరిల్లా యుద్ధ వ్యూహాలు, స్థానిక నెట్‌వర్క్‌లను ఉపయోగించడంలో హిడ్మా సిద్ధహస్తుడు. దీంతో అతడిని భద్రతా దళాలు చాలా కాలం పట్టుకోలేకపోయాయి 2004 నుంచి ఇప్పటివరకు అతను 20కి పైగా ప్రధాన దాడుల్లో పాల్గొన్నట్లు భద్రతా సంస్థలు అంచనా వేస్తున్నాయి. వేలాది మంది సిబ్బందితో పెద్ద ఎత్తున చేపట్టిన ఆపరేషన్లు కూడా హిడ్మాను పట్టుకోలేకపోయాయి. ఎట్టకేలకు మారేడుమిల్లి అటవీ ప్రాంతాల్లో హిడ్మా, అతడి అనుచరులు షెల్టర్ తీసుకున్నారనే విశ్వసనీయ సమాచారం పోలీసులకు చిక్కింది. భద్రతా బలగాలు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకుని కాల్పులు జరిపాయి. ఈ కాల్పుల్లో హిడ్మాతో సహా ఆరుగురు మరణించినట్టు పోలీసులు తెలిపారు.

# పత్తికి మద్దతు ధర ఇచ్చి కొనాలి

- ఢిల్లీకి వెళ్లి పత్తి సమస్యలు ప్రధానికి తెలిపాలి
- లేదంటే సీఎం ఇంటిముందే పత్తిపోసి ధర్నా చేస్తా
- వరంగల్ ఎనుమాముల మార్కెట్ సందర్శించిన హరీష్ రావు



**వరంగల్,నవంబరు18:** పత్తి రైతుకు మద్దతు ధర ఇవ్వకపోతే తెల్ల బంగారాన్ని రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ప్యాలస్ ముందు పోసి ఇంటిని ముట్టడిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీష్ రావు వార్నింగ్ ఇచ్చారు. మంగళవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ను హరీష్ రావు, బీఆర్ఎస్ నేతలు పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ... పత్తి కొనుగోళ్లు నిలిచిపోవడంతో రైతులు మనోవేదనకు గురవుతున్నారని తెలిపారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల వైఖరితో రైతులు ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. సీసీఐ తుగ్లక్ చర్యల వల్ల రైతులు రోడ్డున పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు విధిలేక దళారులకు అమ్ముకుంటున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలను నిలువునా ముంచుతున్నాయని మాజీ మంత్రి విమర్శించారు. రేవంత్ రెడ్డి అరవైసార్లు ఢిల్లీకి వెళ్లారని.. మూటలు పంపుతున్నారు గానీ రైతుల సమస్యలు బడేబాయ్‌కు చెప్పరా అని ప్రశ్నించారు. జూబ్లీహిల్స్‌లో విచ్చలవిడిగా డబ్బులు ఖర్చు పెట్టారని.. మరి రైతులకు మద్దతు ధర ఇప్పించరా అంటూ నిలదీశారు. కపాస్ యాప్ వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎనిమిది మంది తెలంగాణ బీజేపీ ఎంపీలకంటే పంటపొలాల్లో దిష్టి బొమ్మలు నయమంటూ వ్యాఖ్యలు చేశారు. విదేశాల నుంచి పత్తి దిగుమతి చేసుకునేందుకు నిబంధనలు సడలించారని.. కానీ రైతులకు మాత్రం న్యాయం చేయడం లేదని మండిపడ్డారు. ఇప్పటి వరకూ 406 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. రైతులు కన్నీళ్లు పెట్టుకుంటుంటే సీఎం రేవంత్ రెడ్డి విజయోత్సవాలు జరుపుతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తుఫానుతో పంటలు నష్టపోయిన రైతులకు రేవంత్ రెడ్డి సర్కార్ ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మేల్కొని రైతులకు న్యాయం చేయాలని మాజీ మంత్రి హరీష్ రావు డిమాండ్ చేశారు. కాగా.. హరీష్ రావుతో పాటు పత్తియార్డును బీఆర్ఎస్ నేతలు ఎర్రబెల్లి దయాకర్ రావు, మధుసూదనాచారి, చల్లా ధర్మారెడ్డి, మాలోత్ కవిత పరిశీలించారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంట దాకా అన్నీ సమస్యలేనని ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు.

### కేంద్రం నిర్దేశించిన లక్ష్యంలో

# మేమూ భాగస్వామ్యం

## 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమిలో 10శాతం ఉంటాం

### ఫ్యూచర్ సిటీ, ట్రిపుల్ ఆర్, మూసీ రివర్ ఫ్రంట్‌తో మార్పు

### వేగంగా అనుమతులు లభిస్తేనే పురోగతి సాధ్యం

### పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,నవంబర్18:** హైదరాబాద్‌ను అభివృద్ధి చేయడంతో పాటు కొత్త నగరాన్ని నిర్మించాలని భావిస్తున్నట్లు సిఎం రేవంత రెడ్డి వెల్లడించారు. ఫ్యూచర్ సిటీకి ప్రణాళికలు సిద్ధం చేశామని అన్నారు. తెలంగాణ రైజింగ్-2047 పేరుతో కొత్త ప్రణాళిక రూపొందించాం. ప్రపంచంలోనే ఆర్థికంగా ఎదిగిన దేశంగా భారత్‌ను అభివృద్ధి చేసేందుకు కేంద్రం కృషి చేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యాల్లో తెలంగాణ కూడా భాగమవుతుందన్నారు. అయితే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రాజెక్టులకు కేంద్రం త్వరగా అనుమతులు మంజూరు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు లభిస్తే హైదరాబాద్ అభివృద్ధి చెందుతుందని.. తర్వాత దేశ ఆర్థిక వ్యవస్థలో మరింత కీలకంగా మారుతుందని చెప్పారు. హోటల్ ఐటీసీ కోహినూర్‌లో నైరుతి రాష్ట్రాల పట్టణాభివృద్ధి మంత్రుల ప్రాంతీయ సమావేశంలో సీఎం మాట్లాడారు. రాష్ట్రాలకు కేంద్రం సహకరిస్తే దేశాభివృద్ధి మరింత వేగవంతమవుతుంది. కేంద్రం నిర్దేశించుకున్న 30 ట్రిలియన్ డాలర్ల ఎకానమిలో రాష్ట్ర వాటా 10 శాతం ఉండాలని భావిస్తున్నట్లు ఈ సందర్భంగా సిఎం వెల్లడించారు. జీడీపీలో ప్రధానంగా 5 మెట్రోపాలిటన్ నగరాలైన ఢిల్లీ, ముంబయి, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ దేశానికి ఎంతో కీలకంగా ఉన్నాయి. కేంద్రం సహకరించకుంటే రాష్ట్రాల అభివృద్ధి కుంటుపడుతుందని అన్నారు. హైదరాబాద్ మెట్రో రైలు, ఆర్ఆర్ఆర్, మూసీ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం సహకరించాల్సి ఉందన్నారు దేశానికి పెద్దన్నగా ఉన్న ప్రధాని మోదీ సహకరిస్తే అన్ని రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయి. మోదీ గుజరాత్ మోడల్ రూపొందించుకున్నట్లే మేం తెలంగాణ మోడల్ తీసుకొచ్చాం. ఆయన సబర్మతి నది ప్రక్షాళన చేపట్టినట్లే మేం మూసీ పునరుజ్జీవం చేస్తున్నాం. గుజరాత్‌కు మోదీ ఇచ్చిన సహకారాన్నే మేం తెలంగాణకు కోరుతున్నాం అని వివరించారు. ఎన్నికలు ఉన్నప్పుడు మాత్రమే రాజకీయాలు చేద్దాం అని రేవంత్‌రెడ్డి అన్నారు. తరవాత అభివృద్ధి గురించే మాట్లాడుతామని అన్నారు. అభివృద్ధిలో దూసుకు వెళ్లాలలన్నదే తమ అభిమతమని అన్నారు. మా పోటీ ఇతర రాష్ట్రాలతో కాదని, టోక్యో, సింగపూర్ లాంటి వాటితోనని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్, ఏపీ మంత్రి పొంగూరు నారాయణ, గుజరాత్ మంత్రి కనుభాయ్ మోహన్‌లాల్ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు.




### 21న జాతీయ రహదారుల...

# దిగ్బంధం

- పత్తి, సోయాబిన్ పంటలను వెంటనే కొనాలి
- పత్తి రైతులకు అండగా ప్రభుత్వం నిలవాలి
- ఆదిలాబాద్ పత్తి మార్కెట్ సందర్శించిన కెటిఆర్

**ఆదిలాబాద్,నవంబరు18:** అన్నదాతలకు మద్దతుగా ఈ నెల 21న జాతీయ రహదారుల దిగ్బంధం నిర్వహించనున్నట్లు కెటిఆర్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదిలాబాద్ అన్నదాతలు భారీగా తరలి రావాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. రైతాంగం ముఖ్యంగా పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని ప్రభుత్వంపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు ఆందోళన చేపడుతున్నామని అన్నారు. ఈ క్రమంలో కేటీఆర్ పార్టీ సీనియర్ నేతలతో కలిసి ఆదిలాబాద్ జిల్లాలో పర్యటించారు.

ఆదిలాబాద్ పట్టణంలోని మార్కెట్ యార్డులో పత్తి, సోయా రైతులను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు తమకు ఎదురవుతున్న సమస్యలను తెలియజేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదని కేటీఆర్‌కు తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి రైతన్నలకు ఇచ్చిన హామీలన్నింటిని పక్కన పెట్టిందని, కనీసం పండిన పంటలను అమ్ముకోవడంలో కూడా సహకారం అందించడం



లేదని తెలిపారు. రైతన్నల సమస్యల పరిష్కారానికి పోరాటాలు మాత్రమే మార్గం. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలపైన ఒత్తిడి తీసుకువచ్చేందుకు అన్ని రకాల పోరాటాలను చేసేందుకు మా పార్టీ సంసిద్ధంగా ఉన్నది.

# అర్బన్ నక్సల్స్ ఉచ్చులో పడొద్దు

### బతికున్న వారు వెంటనే లొంగిపోవావాలి

### కేంద్రమంత్రి బండి సంజయ్ హితవు

**వేములవాడ,నవంబర్18 :** అర్బన్ నక్సల్స్ పట్టణాల్లో జల్సా చేస్తున్నారని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శించారు. మావోయిస్టుల మరణాలకు అర్బన్ నక్సల్స్ కారకులని తెలిపారు. నక్సల్స్‌కు సపోర్ట్ చేసిన అర్బన్ నక్సల్స్ ద్రోహులని అభివర్ణించారు. తక్షణమే తుపాకీ వీడి జన జీవన స్రవంతిలో కలవాలని మావోయిస్టులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచించారు. వారిని చూసి మోసపోవద్దంటూ ప్రజలకు ఆయన స్పష్టం చేశారు. మంగళవారం వేములవాడలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. పైరవీలు చేసుకుంటూ ఆస్తులు పోగేసుకుంటున్నారని అర్బన్ నక్సల్స్‌పై నిప్పులు చెరిగారు. వారి మాటలు నమ్మి అమాయక,పేద ప్రజలు తుపాకీ పట్టి అడవుల్లో తిండి తిప్పలు లేకుండా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మరో 4 నెలల గడువు మాత్రమే ఉదంటూ ఈ సందర్భంగా మావోయిస్టులకు ఆయన గుర్తు చేశారు.

# టీటీడీ పరకామణి దోపిడీ కేసులో పెద్ద కుట్ర

- మంత్రి పార్థసారథి సంచలన ఆరోపణలు
- దొంగలు దొరికిపోతారనే భయంతోనే సతీష్ కుమార్‌ను హత్య చేశారు
- నెల్లోనే ఛార్జ్‌షీట్ రాజీపై తీవ్రమైన అనుమానాలు
- వివేకా కేసు తరహాలోనే ఆత్మహత్యగా చూపే ప్రయత్నమని విమర్శ




**మంగళగిరి, 17 నవంబర్ (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** టీటీడీ పరకామణిలో జరిగిన రూ.100 కోట్ల విదేశీ కరెన్సీ చోరీ కేసు వెనుక భారీ కుట్ర ఉందని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి సంచలన ఆరోపణలు చేశారు. దోపిడీ వివరాలు బయటపడతాయన్న భయంతోనే అప్పటి విజిలెన్స్ అధికారి సతీష్ కుమార్‌ను హత్య చేశారని ఆయన ఆరోపించారు. తిరుమల పవిత్రతను భంగం కలిగించేలా గత పాలకులు దోపిడీలు జరిపిన తీరు భక్తులను తీవ్రంగా కలచివేసిందన్నారు. 2023 ఏప్రిల్ 29న సతీష్ కుమార్ ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసినప్పటికీ, ఇలా పెద్ద మొత్తంలో దోపిడీ జరిగి కూడా సాధారణ సెక్షన్లతో కేసు నమోదు చేయడం వెనుక తీవ్ర అనుమానాలు ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. కేసు నమోదు చేసిన నెల రోజుల్లోనే ఛార్జ్‌షీట్ దాఖలు చేసి, మరుసటి రోజే రాజీ మెమో దాఖలు చేయడం ఎవరి ఒత్తిడితో జరిగిందో వెలుగు చూడాలని అన్నారు. నిందితుడి దగ్గర ఉన్న రూ.14.5 కోట్ల ఆస్తులను 'దానం' పేరిట చూపించడం ద్వారా కేసును బలహీనపరిచినట్లు ఆరోపించారు. సతీష్ కుమార్ అనుమానాస్పద మరణాన్ని ఆత్మహత్యగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నట్టు పార్థసారథి విమర్శించారు. సతీష్ సోదరుడు హత్యేనని చెబుతుంటే, పోలీసుల కంటే ముందే మాజీ టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆత్మహత్యగా ప్రకటించడమే సందేహాస్పదమన్నారు. రాజీ ప్రక్రియ కూడా భూమన ఛైర్మన్ అయిన నెల రోజుల్లోనే జరగడం అనుమానాలను మరింత పెంచుతోందన్నారు. వివేకానంద రెడ్డి, పరిటాల రవి హత్య కేసుల్లో జరిగినట్లే, ఈ కేసులోనూ సాక్షులను తొలగించే కుట్ర కనిపిస్తున్నదని మంత్రి వ్యాఖ్యానించారు. సీబీఐ దర్యాప్తును గతంలో వ్యతిరేకించిన నాయకులు ఇప్పుడు సీబీఐ విచారణ కోరడమే వాస్తవాలను వక్రీకరించే ప్రయత్నమని విమర్శించారు. తిరుమలపై గత ప్రభుత్వానికి భక్తి, గౌరవం లేవని, పవిత్రతను దోపిడీలకు వేదికగా మార్చారని పార్థసారథి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసులో ఎంతటి పెద్దవారైనా సరే, చట్టం ముందు నిలబెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి పార్థసారథి ప్రభుత్వం తరపున స్పష్టం చేశారు.

# నా భార్య, నా అత్త వల్లే ఈరోజు నేను ఇలా అయ్యా

- ఐ బొమ్మ రవి పోలీసుల ఎదుట సంచలన ఒప్పుకోలు
- వెబ్‌డిజైనర్ నుంచి ఐ బొమ్మ సైట్ నిర్వాహకుడిగా మారిన కథ
- గృహ సమస్యలు, అవహేళనలు తనను నేరాల దారిలోకి నెట్టాయని వాపోకు
- భావోద్వేగంతో రవి వెల్లడించిన పలు షాకింగ్ విషయాలు



**హైదరాబాద్, 18 నవంబర్ (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ప్రముఖ పైరసీ వెబ్‌సైట్ 'ఐ బొమ్మ' కేసులో అరెస్ట్ అయిన రవి పోలీసుల విచారణలో సంచలన వ్యాఖ్యలు చేశాడు. తనను ఈ దారిలోకి నెట్టింది కుటుంబంలోని అవహేళనలు, భార్య%-%అత్త ఒత్తిడేనని కంటతడి పెట్టి చెప్పినట్టు సమాచారం. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ద్వారా భారీగా సంపాదించిన డబ్బు కూడా తన కుటుంబం నమ్మలేదని, దీనివల్లనే తన జీవితం నేర దారిలోకి మళ్లిపోయిందని రవి వెల్లడించాడు. పోలీసులకు తెలిపిన వివరాల ప్రకారం, విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో సాధారణ డిగ్రీ పూర్తి చేసిన రవి, వెబ్‌డిజైనర్‌గా తన కెరీర్‌ను ప్రారంభించాడు. తల్లిదండ్రులు విడిపోయిన తరువాత కుటుంబ బాధ్యతలన్నీ తన భుజాలపై పడ్డాయని, తన చెల్లిని గత ఏడాదే పెళ్లి చేసిన విషయాన్ని గుర్తుచేశాడు. ప్రేమించి పెళ్లి చేసుకోవడంతో తనపై బాధ్యత మరింత పెరిగిందని, కానీ అదే పెళ్లే తన జీవితంలో ఒత్తిడికి కారణమైందని వాపోయాడు. సంభవించిన ప్రతి సమస్యలో భార్య, అత్త సమాజం మాటల్ని నమ్మి తనను అవమానించారని, తక్కువ జీతం కారణంగా కుటుంబ అవసరాలు తీర్చలేక పోతే మరింతగా అవహేళనలు ఎదుర్కొన్నట్టు తెలిపాడు. "నేను ఇచ్చే డబ్బు సరిపోదు%ౌ% నేనుండకపోతే బెటర్" అనే మాటలే తనను మానసికంగా ఛిన్నాభిన్నం చేశాయని రవి చెప్పినట్టు పోలీసులు తెలిపారు. ఈ నేపథ్యంలో 2021 కరోనా రెండో తరంగ సమయంలో తన వెబ్‌డిజైన్ నైపుణ్యంతో ఐ బొమ్మ వెబ్‌సైట్‌ను ప్రారంభించినట్టు రవి ఒప్పుకున్నాడు. అప్పట్లో విడుదలైన సినిమాల అసలు ప్రింట్లను అప్‌లోడ్ చేయడం వల్ల వెబ్‌సైట్ ఒక్కసారిగా పాపులర్ అయ్యిందని, రోజురోజుకూ ట్రాఫిక్ పెరిగి తనకు భారీ ఆదాయం వచ్చిందని వివరించాడు. బెట్టింగ్ యాప్స్, లోన్ యాప్స్ ప్రకటనల ద్వారా వచ్చిన మొదటి సంపాదన ?75 లక్షలు అని చెప్పాడు. అయితే ఈ సంపాదనను కూడా భార్యఅత్త నమ్మలేదని, తనను వదిలించుకోవాలని వారి మనసులో ముందే నిర్ణయం తీసుకున్నట్టు అనిపించిందని పేర్కొన్నాడు. "ఇవరూ నన్ను ఒప్పుకోనప్పుడు, డబ్బు తప్ప ఇంకేదీ నన్ను కాపాడదని అప్పుడు అర్థమైంది" అని పోలీసులకు తెలిపినట్టు తెలుస్తోంది. "ఈరోజు మీకు దొరికిపోవడానికి కూడా కారణం వాళ్లే" అనే రవి వ్యాఖ్యలు విచారణలో కలకలం రేపాయి. పోలీసులు రవిని మరింతగా విచారిస్తూ పైరసీ నెట్‌వర్క్, ఆదాయం మార్గాలు, ఇతర సంబంధిత వ్యక్తులపై మరిన్ని వివరాలు సేకరిస్తున్నారు.

# మానవత్వం చాటి చూపిన ఆర్టీసీ డ్రైవర్

- సూర్యాపేటలో చిన్నారిని ప్రేమగా చూసుకున్న డ్రైవర్‌కు ప్రశంసలు
- తల్లి తిరిగివచ్చే వరకు శిశువుకు ఆలనాపాలన బాధ్యతగల ఉద్యోగి ప్రతిభ
- సేవ మాత్రమే కాదు మనసున్న మనుషులు కూడా ఆర్టీసీ బలం
- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, 18 నవంబర్ (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** విధి నిర్వర్తనలోనే కాదు, మానవత్వంలోనూ ఆదర్శంగా నిలిచే ఆర్టీసీ సిబ్బందిలో మరో ఉదాహరణ వెలుగులోకి వచ్చింది. సూర్యాపేట బస్టాండ్ వద్ద తన చిన్నారితో ప్రయాణిస్తున్న మహిళ వ్యక్తిగత అవసరాల కోసం బస్సు దిగగా, ఆ శిశువును చూసేందుకు ఎవరూ లేకపోయారు. ఈ పరిస్థితిని గమనించిన మనుగూరు ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్, ఆ చిన్నారిని ప్రేమగా చూసుకుంటూ, జాగ్రత్తగా దగ్గర పెట్టుకుని తన మానవీయతను చాటుకున్నారు. శిశువును సురక్షితంగా కాపాడుతూ, తల్లి తిరిగి వచ్చే వరకు దాని పట్ల ఆప్యాయత చూపిన ఈ డ్రైవర్ వ్యవహారం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా వైరల్ అవుతోంది. తిరిగి వచ్చిన తల్లికి ఆ చిన్నారిని సంపూర్ణంగా సురక్షితంగా అప్పగించిన ఈ సంఘటన ప్రజలను అట్టడుగునుంచి హత్తుకుంటోంది. ఈ సంఘటనపై స్పందించిన మంత్రి పొన్నం ప్రభాకర్, ఆ డ్రైవర్ సేవా భావాన్ని హృదయపూర్వకంగా అభినందించారు. "ఆర్టీసీ అంటే కేవలం ప్రయాణ సేవ మాత్రమే కాదు%ౌ% మనసున్న మనుషుల తోటి సురక్షిత ప్రయాణం కూడా" అని ఆయన అన్నారు. డ్రైవర్ చేసిన ఈ మానవీయ చేష్ట ఆర్టీసీ ప్రతిష్ఠకు మరింత మెరుగులు దిద్దిందని ప్రశంసించారు. ప్రజలు, ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బంది అందరూ ఈ ఘటనను హృదయపూర్వకంగా స్మరిస్తూ, ఇటువంటి మానవీయ సేవలు సమాజంలో ఇంకా ఉన్నాయని గర్వంగా పేర్కొంటున్నారు.

# భవిష్యత్‌లో నాలెడ్జ్ హబ్‌గా మారుస్తాం : సీఎం రేవంత్ రెడ్డి

- అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీకి డిజిటల్ ఎడ్యుకేషన్‌లో పెద్ద అడుగు
- కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్‌తో ఒప్పందం - ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ స్థాపన



**హైదరాబాద్, 18 నవంబర్ (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** తెలంగాణలో డిజిటల్ విద్యకు నూతన దిశలో అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ అడుగు వేసింది. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుని, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఎడ్యుకేషన్ అకాడమీ స్థాపనకు సిద్ధమవుతోంది. ఈ ఒప్పందం ద్వారా అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిజిటల్ విద్యా రంగంలో ప్రముఖ స్థాయికి ఎదుగుతుందని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. ఈ ఒప్పందం అమలులోకి వస్తే అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిజిటల్ విద్య, ఆన్‌లైన్ లెర్నింగ్, నూతన బోధనా సాంకేతికతల్లో ముందంజలో నిలుస్తుందని చెప్పారు. "భవిష్యత్తులో ఈ యూనివర్సిటీని ఒక భారీ నాలెడ్జ్ హబ్‌గా మారుస్తాం. ప్రపంచ స్థాయి డిజిటల్ విశ్వవిద్యాలయ స్థాయికి తీసుకెళ్తాం" అని సీఎం స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కామన్వెల్త్ ఆఫ్ లెర్నింగ్ అధ్యక్షుడు %డ జజూ% పీటర్ స్కాట్, ప్రభుత్వ సలహాదారు కే. కేశవరావు, వైస్‌చాన్సలర్ ఘంటా చక్రపాణి, పలు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో డిజిటల్ విద్యా వ్యవస్థను బలపరిచే దిశగా ఇది కీలకమైన అడుగుగా భావిస్తున్నారు.

# బాలయ్యపై వ్యాఖ్యలు చేస్తే సహించం

- హిందూపురంలో వైసీపీ కార్యాలయంపై టీడీపీ కార్యకర్తల దాడి
- బాలకృష్ణపై వ్యాఖ్యలతో ప్రాంతంలో ఉద్రిక్తత
- బాలయ్య జోలికి వస్తే ఎవరినీ వదలం - ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు హెచ్చరిక



**హిందూపురం, 17 నవంబర్ (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** హిందూపురం ప్రాంతంలో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగాయి. హిందూపురం ఎమ్మెల్యే, సినీనటుడు నందమూరి బాలకృష్ణపై కొందరు వైసీపీ నేతలు చేసిన వ్యాఖ్యలకు ప్రతిగా టీడీపీ కార్యకర్తలు వైసీపీ కార్యాలయంపై దాడి చేయగా, పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. ఈ వ్యవహారంపై శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. తాను బాలయ్యకు అభిమానిగా మాట్లాడుతున్నానని చెప్పిన ఎమ్మెల్యే రాజు, "బాలయ్య జోలికి వస్తే చర్మం ఒలిచేస్తాం. హిందూపురంలో కొందరు చిల్లర వెధవలు బాలకృష్ణ గురించి మాట్లాడటంతో మా కార్యకర్తలు ఆవేశాన్ని చూపారు. ఇది మీకూ, మీ అధినేతకూ హెచ్చరిక" అని స్పష్టం చేశారు. బాలకృష్ణపై అనుచిత వ్యాఖ్యలే ఈ వివాదానికి మూలమని ఆయన పేర్కొన్నారు. హిందూపురంలో వైసీపీ కార్యాలయం, పార్టీ ఇన్‌ఛార్జ్ దీపికా రెడ్డి భర్త కార్యాలయంపై కూడా టీడీపీ కార్యకర్తలు దాడి చేయడంతో అక్కడ ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పరిస్థితిని అదుపులోకి తేవడానికి పోలీసులు చర్యలు చేపట్టారు. ఈ వివాదం రాజకీయం మరోసారి హాట్ టాపిక్‌గా మారింది.

# బూత్ స్థాయి నిర్మాణంపై దృష్టి

- టీఎస్ బీజేపీ సమీక్షా సమావేశానికి నేతృత్వం వహించిన రాంచందర్ రావు
- రాబోయే నెలల వ్యూహాలపై చర్చలు
- బలమైన తెలంగాణ బీజేపీ బలమైన భారత్" లక్ష్యంగా ఏకమవుతున్న నేతలు




**హైదరాబాద్, 18 నవంబర్ (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** తెలంగాణ బీజేపీ ప్రధాన కార్యదర్శులు, మోర్చా అధ్యక్షులతో రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగిన కీలక సమీక్షా సమావేశానికి తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వం వహించారు. పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం, బూత్ స్థాయి ఆధారాన్ని విస్తరించే అంశాలపై ఈ సమావేశంలో విస్తృత చర్చ జరిగింది. సమావేశం అనంతరం రాంచందర్ రావు మాట్లాడుతూ టీఎస్ బీజేపీని గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు మరింత బలపర్చే దిశగా అన్ని విభాగాలూ సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా పార్టీ కార్యాచరణ ప్రణాళికలను సవరించుకోవాలని, బూత్ కమిటీలను శక్తివంతం చేయడం తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. విభిన్న మోర్చాలు చేపట్టే కార్యక్రమాలు, యువత మహిళల భాగస్వామ్యం, సోషల్ మీడియా వ్యూహాలు, తదుపరి నెలల్లో అమలు చేసే ప్రత్యేక ప్రచార ప్రణాళికలపై నేతలు సమగ్ర చర్చ జరిపారు. ప్రతి నేత, ప్రతి కార్యకర్త ఒకే దిశగా కట్టుబాటుతో పనిచేస్తున్నారని రాంచందర్ రావు పేర్కొన్నారు. "బలమైన తెలంగాణ బీజేపీ బలమైన భారత్" సూత్రంతో పార్టీ ముందుకు సాగుతుందని, వచ్చే రోజుల్లో ప్రజల్లో మరింత చేరువయ్యే కార్యక్రమాలు చేపట్టనున్నట్టు రాంచందర్ రావు వెల్లడించారు.

# సనాతన ధర్మంపై తన వైఖరిని స్పష్టం చేసిన బండి సంజయ్

- హిందుత్వంపై గర్వంగా మాట్లాడుతాను%ౌ% ఎప్పటికీ తగ్గించను
- పహల్‌గామ్ ఘటనను గుర్తుచేసిన బండి సంజయ్
- సివిలైజేషనల్ రూట్స్ మన బలం : బీజేపీ నేత వ్యాఖ్యలు




**హైదరాబాద్, 18 నవంబర్ (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ హిందుత్వ, సనాతన ధర్మంపై తన దృఢమైన వైఖరిని మరోసారి స్పష్టం చేశారు. సనాతన ధర్మం మన నాగరికతకు మూలస్తంభమని, దానిపై గర్వంతో మాట్లాడటంలో ఎలాంటి సంకోచం లేదని ఆయన పేర్కొన్నారు. సనాతన విలువలను కాపాడటానికి తాను ఎలాంటి ఒత్తిడికీ, విమర్శకులకీ వెనక్కి తగ్గబోనని బండి సంజయ్ తెలిపారు. "మన పెద్ద బలం మన సంస్కృతి మన సనాతన ధర్మం. దీనిపై నేను గర్వంగా మాట్లాడుతాను. ఎవరైనా ప్రశ్నించినా, ఒత్తిడి తీసుకురావాల నుకున్నాదానిని తగ్గించను" అని వ్యాఖ్యానించారు. పహల్‌గాంలో హిందువులపై జరిగిన ఉగ్రదాడులను గుర్తుచేసిన బండి సంజయ్, ఈ ఘటనలు మన నాగరికతను కాపాడుకోవాల్సిన అవసరాన్ని గుర్తు చేస్తున్నాయని అన్నారు. పొరుగు దేశాల్లో జరుగుతున్న పరిస్థితులను చూస్తే నాగరికత విలువలను రక్షించాల్సిన బాధ్యత మరింత పెరిగిందని తెలిపారు. ప్రతి హిందువు సనాతన ధర్మంపై గర్వంగా నిలబడాలని, మన సంస్కృతిని కాపాడటంలో ఎలాంటి రాజీ ఉండకూడదని బండి సంజయ్ పిలుపునిచ్చారు. మన మూలాలను రక్షించుకోవడం దేశ భవిష్యత్తు కోసం అత్యవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. బండి సంజయ్ వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.

# బొమ్మ రవి కేసులో ఈడీ ఎంట్రీ

- మనీలాండరింగ్ కోణంలో లోతైన విచారణకు రంగం సిద్ధం
- బెట్టింగ్ యాప్స్ ద్వారా నిధుల సమీకరణ - - క్రిప్టో వాలెట్ల నుంచి విదేశీ లావాదేవీలు
- నిందితుడి ఖాతాలోని రూ.3.5 కోట్లు ఫ్రీజ్

**హైదరాబాద్, నవంబర్ 18 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించిన పైరసీ వెబ్‌సైట్ 'ఐ-బొమ్మ' కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) రంగంలోకి దిగడం పెద్ద మలుపుగా మారింది. ఈ కేసులో భారీ స్థాయిలో ఆర్థిక అవకతవకలు మరియు మనీలాండరింగ్ (డబ్బు అక్రమ తరలింపు) జరిగినట్లు ఈడీ అధికారులు ప్రాథమికంగా అనుమానిస్తున్నారు. ఈ అనుమానాల నేపథ్యంలో, ఈ కేసును లోతుగా దర్యాప్తు చేసేందుకు ఈడీ సమాయత్తమవుతోంది. పైరసీ వెనుక జరిగిన ఆర్థిక లావాదేవీలు, బెట్టింగ్ యాప్‌ల ద్వారా నిధుల సమీకరణ వంటి అంశాలపై ఇప్పుడు ఈడీ దృష్టి కేంద్రీకృతం కానుంది. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, ఎఫ్ఐఆర్, మరియు దర్యాప్తు నివేదికలను తమకు అందించాలని కోరుతూ ఈడీ అధికారులు ఇప్పటికే హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌కు అధికారికంగా లేఖ రాశారు. పోలీసుల నుంచి వివరాలు అందిన వెంటనే ఈడీ అధికారులు మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద తమ విచారణను అధికారికంగా ప్రారంభించనున్నారు. ఈడీ దర్యాప్తుతో నిందితుడు ఇమ్మడి రవికి విదేశీ నిధుల ప్రవాహం, అక్రమ హవాలా లావాదేవీలతో సంబంధం ఉందా అనే కోణంలో లోతుగా పరిశోధన జరగనుంది. ఐ-బొమ్మ వెబ్‌సైట్ నిర్వహణ ద్వారా ఇమ్మడి రవికి బెట్టింగ్ యాప్‌ల ప్రకటనల రూపంలో భారీగా నిధులు అందినట్లు గతంలో పోలీసుల దర్యాప్తులో స్పష్టమైంది. అంతేకాకుండా, ఈ నిధుల మూలాలను మరింత లోతుగా పరిశోధించగా, ఒక క్రిప్టో వాలెట్ నుంచి రవికి చెందిన ఎన్నారై ఖాతాకు ప్రతి నెలా సుమారు రూ.15 లక్షలు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. ఈ క్రిప్టో, ఎన్నారై ఖాతాల లావాదేవీలు విదేశీ నిధుల ప్రవాహానికి మరియు అక్రమ నగదు బదిలీకి సూచనగా ఉండటంతో, ఈడీ దీనిపై తీవ్రంగా దృష్టి సారించింది. ఇప్పటికే పోలీసులు చట్టపరమైన ప్రక్రియల ద్వారా నిందితుడు ఇమ్మడి రవికి చెందిన వివిధ బ్యాంకు ఖాతాల్లో ఉన్న సుమారు రూ.3.5 కోట్లను ఫ్రీజ్ చేశారు. ఈ మొత్తం నిధులు అక్రమ మార్గాల ద్వారా వచ్చినవిగా పోలీసులు భావిస్తున్నారు. ఇప్పుడు ఈడీ రంగంలోకి దిగడం వలన, నిందితుడి బ్యాంకు ఖాతాల నిర్వహణ, ఆ నిధుల మూలాలు, వాటి మళ్లింపుపై పూర్తి స్థాయిలో విచారణ జరగనుంది. చట్ట విరుద్ధ కార్యకలాపాల ద్వారా ఆర్జించిన ఆస్తులను జప్తు చేసే అధికారం ఈడీకి ఉండటం వలన, ఈ కేసు మరింత కీలకంగా మారనుంది. మొత్తం మీద, కేవలం పైరసీ కేసుగానే కాకుండా, ఇదొక అంతర్జాతీయ ఆర్థిక నేరాల కోణంలోకి మారే అవకాశం కనిపిస్తోంది. ఐ-బొమ్మ వెనుక ఉన్న భారీ ఆర్థిక వ్యవస్థ, హవాలా, క్రిప్టో లావాదేవీలు వంటి అంశాలపై ఈడీ దర్యాప్తు కేంద్రంగా ఉంటుంది. ఈ దర్యాప్తు సినీ పరిశ్రమలో పైరసీకి అడ్డుకట్ట వేయడమే కాకుండా, అక్రమ ఆస్తుల నిర్మూలనలోనూ ముఖ్య పాత్ర పోషించనుంది. ఈడీ విచారణ తర్వాత నిందితులపై మరింత కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

# ముంచుకొస్తున్న అల్పపీడనం

- రెండు రాష్ట్రాలకు వాతావరణ హెచ్చరిక - ఏపీకి వాన గండం.. తెలంగాణలో చలి పంజా
- సింగిల్ డిజిట్‌కు పడిపోయిన ఉష్ణోగ్రతలు



**ఆంధ్రప్రదేశ్/ తెలంగాణ, నవంబర్ 18 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ఆంధ్రప్రదేశ్‌లో ప్రస్తుతం విచిత్రమైన వాతావరణ పరిస్థితి కొనసాగుతోంది. ఒక వైపు చలి తీవ్రత గజగజ వణికిస్తుంటే, మరోవైపు బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం కారణంగా పలుచోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. నైరుతి బంగాళాఖాతంలో అల్పపీడనం కొనసాగుతోందని, దీని ప్రభావంతో మంగళవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ వెల్లడించింది. ప్రకాశం, అనంతపురం, అన్నమయ్య, సత్యసాయి, కడప, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. మరోవైపు, నవంబర్ 21వ తేదీన బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడనుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా మరో నాలుగు రోజుల పాటు ఓ మోస్తారు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఇప్పటికే మంగళవారం ఉదయం నుంచి తిరుమల, తిరుచానూరులో భారీ వర్షం కురుస్తుండటంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అల్పపీడన వర్షాల కారణంగా ఏపీలో కొన్ని ప్రాంతాల్లో చలి మరియు వానల మిశ్రమ వాతావరణం నెలకొనే అవకాశం ఉంది. ఇక తెలంగాణ విషయానికొస్తే, రాష్ట్రంలో చలి పంజా విసురుతోంది. కనిష్ట ఉష్ణోగ్రత రికార్డు స్థాయిలో 7 డిగ్రీలకు పడిపోయింది. భారతదేశం అంతటా చలిగాలులు, వర్షపాతం హెచ్చరికలను జారీ చేసిన ఐఎండీ, నవంబర్ 18 నుంచి 20 తేదీల మధ్య పశ్చిమ మధ్యప్రదేశ్, తూర్పు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, విదర్భలోని కొన్ని ప్రాంతాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉందని తెలిపింది. సంగారెడ్డి, కొమురంభీం జిల్లా ఆసిఫాబాద్‌లో 7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. వికారాబాద్, రంగారెడ్డి, సిరిసిల్ల, కామారెడ్డి, సిద్దిపేట, నిజామాబాద్‌లలో 8 డిగ్రీలు, భూపాలపల్లిలో 9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని ఆదిలాబాద్, కొమురంభీం, మంచిర్యాల, నిర్మల్, మెదక్, నిజామాబాద్, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో చలిగాలుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం 'ఎల్లో అలర్ట్' జారీ చేసింది. రాబోయే రెండు రోజుల్లో కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 4 నుండి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉందని వెల్లడించింది. దీనికితోడు, ఏపీలోని ఏజెన్సీ ప్రాంతాల్లో కూడా ఉష్ణోగ్రతలు దారుణంగా పడిపోతున్నాయి. అల్లూరి జిల్లా మినుములూరులో అత్యల్పంగా 6 డిగ్రీలు, అరకులో 7.3, పాడేరులో 8 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదై, దట్టమైన పొగమంచు కమ్ముకుంది. ఈ విపరీత వాతావరణ మార్పుల నేపథ్యంలో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా వృద్ధులు మరియు పిల్లలు చలి నుంచి రక్షణ పొందేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. ఏపీలో అల్పపీడనం కారణంగా లోతట్టు ప్రాంతాల ప్రజలు మరియు రైతులు కూడా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ హెచ్చరించింది. రాబోయే నాలుగు రోజులు వాతావరణ పరిస్థితుల్లో ఎలాంటి మార్పులు సంభవిస్తాయో వేచి చూడాలి.

# కోటి మంది మహిళలకు సిరిసిల్ల చీరలు

- రెండు దశల్లో చీరల పంపిణీ - - నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత
- సిరిసిల్ల చేనేత కార్మికుల తయారీ - ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



**హైదరాబాద్, నవంబర్ 18 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతిని పురస్కరించుకుని రాష్ట్రంలోని కోటి మంది మహిళలకు కోటి చీరలను పంపిణీ చేసే ఇందిరమ్మ చీరలు కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం అమలుపై మంత్రి ధనసరి అనసూయ సీతక్కతో పాటు ఉన్నతాధికారుల సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అర్హులైన ప్రతీ మహిళకు ఇందిరమ్మ చీరను అందించాలని ముఖ్యమంత్రి అధికారులకు స్పష్టంగా సూచించారు. మహిళలకు నాణ్యమైన వస్త్రాలను అందించడం ద్వారా వారికి గౌరవాన్ని పెంచడమే లక్ష్యంగా ఈ పథకాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా పంపిణీ చేయాల్సిన ఈ చీరలను పూర్తిగా సిరిసిల్ల చేనేత కార్మికులు తయారు చేస్తున్నారు. చేనేత రంగాన్ని ప్రోత్సహించడానికి, వారికి ఉపాధి కల్పించడానికి ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, చీరల ఉత్పత్తి ఆలస్యం అవుతున్న నేపథ్యంలో, ఉత్పత్తికి అనుగుణంగా చీరల పంపిణీని రెండు దశల్లో చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు. ఈ విధంగా పంపిణీ చేయడం ద్వారా సిరిసిల్ల కార్మికులకు పూర్తిస్థాయిలో పని కల్పించినట్లవుతుందని, లబ్ధిదారులకు కూడా నిరంతరాయంగా చీరలు అందుతాయని ప్రభుత్వం భావిస్తోంది. పంపిణీ యొక్క తొలి దశలో, ఇందిరా గాంధీ జయంతి రోజు నుంచి డిసెంబరు 9 తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం వరకు గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రెండవ దశలో పట్టణ ప్రాంతాల్లో మార్చి 1 నుంచి మార్చి 8 అంతర్జాతీయ మహిళా దినోత్సవం వరకు చీరల పంపిణీ పూర్తి చేయాలన్నారు. ఈ రెండు ముఖ్యమైన తేదీలను ఎంచుకోవడం ద్వారా పథకానికి మరింత ప్రాధాన్యత లభిస్తుందని ప్రభుత్వం యోచిస్తోంది. నిర్ణీత లక్ష్యాలకు అనుగుణంగా పంపిణీని పూర్తి చేయాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. చీరల పంపిణీలో నాణ్యత విషయంలో రాజీపడొద్దని, మహిళలకు నాణ్యమైన చీరలను అందించాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. నాణ్యత లోపిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా, సాంకేతికను వినియోగించుకుని ఇందిరమ్మ చీరల పంపిణీ పారదర్శకంగా జరిగేలా చూడాలని, పంపిణీ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. అర్హులందరికీ లబ్ధి చేకూరుతుందని, ఎక్కడా అవకతవకలు జరగడానికి వీలు లేదని ముఖ్యమంత్రి అన్నారు. ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు నెక్లెస్ రోడ్‌లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద నివాళులు అర్పించిన అనంతరం ముఖ్యమంత్రి చీరల పంపిణీని లాంఛనంగా ప్రారంభిస్తారు. అనంతరం సెక్రటేరియట్ నుంచి గ్రామీణ ప్రాంత మహిళలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముఖాముఖి మాట్లాడుతారు. రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అందుబాటులో ఉన్న కలెక్టరేట్ల నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొనాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు.

# ఏపీలో హై అలర్ట్ ౦ మావోయిస్టుల కదలికలతో భద్రతా దళాల గాలింపు చర్యలు బిగింపు

- బహుళ జిల్లాల్లో సెర్చ్ ఆపరేషన్
- ఎన్‌కౌంటర్‌లో హిడ్మా సహా ఆరుగురి మృతి
- ఏలూరు సహా పలు చోట్ల 46 మంది అరెస్టు



**అమరావతి, 18-11-2025 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** ఏపీ అంతటా మావోయిస్టుల కదలికలు పెరగడంతో భద్రతా వ్యవస్థ అలర్ట్ మోడ్‌లోకి వెళ్లింది. అడవి ప్రాంతాల నుంచి రాష్ట్రంలోకి చొరబడిన మావోయిస్టుల కోసం పోలీసులు, గ్రేహౌండ్స్ దళాలు భారీ స్థాయిలో గాలింపు చర్యలు చేపట్టాయి. ఇప్పటికే విజయవాడలో 31 మంది మావోయిస్టులను అదుపులోకి తీసుకున్న తర్వాత, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, కాకినాడ, అల్లూరి జిల్లాల్లో విస్తృతంగా సెర్చింగ్ కొనసాగుతోంది. ఈ క్రమంలో ఏలూరులో మాత్రమే 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అల్లూరి జిల్లాలో ఉదయం జరిగిన ఎన్‌కౌంటర్‌పై ఏపీ ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర కీలక వివరాలు వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన పరిణామాల తర్వాత మావోయిస్టులు మళ్లీ ఏపీ వైపు కదులుతున్నట్లు సమగ్ర సమాచారం అందిందని తెలిపారు. రెండు రోజుల క్రితమే మావోయిస్టుల కదలికలపై పక్కా ఇన్‌పుట్ వచ్చిన నేపథ్యంలో, భద్రతా బలగాలు అప్రమత్తంగా ఉండి గాలింపు చేపట్టాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో ఉదయం 6.30 నుంచి 7 గంటల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో అగ్రనేత హిడ్మా, ఆయన సతీమణి సహా ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. అరెస్టయిన వారిలో 9 మంది మావోయిస్టులు కేంద్ర కమిటీ సభ్యుడు దేవ్‌జీ అనుచరులని, మిగతావారు సౌత్ బస్తర్ జోనల్ కమిటీకి చెందినవారని ఇంటెలిజెన్స్ అధికారులు వెల్లడించారు. మావోయిస్టు కార్యకలాపాలను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా నిఘా మరింత బలపరచినట్లు పోలీసులు తెలిపారు. ఏపీ సరిహద్దుల్లో భద్రతా చర్యలు పెంచడంతో, అడవి ప్రాంతాలలో సుదీర్ఘంగా గాలింపు ఆపరేషన్లు కొనసాగనున్నాయని అధికారులు స్పష్టం చేశారు.

# షేక్ హసీనా మరణశిక్షపై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు

- తీర్పుపై భారత్ ఆందోళన - భారత్‌కు అప్పగించాలని విజ్ఞప్తి
- అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ తీర్పు - థరూర్ వ్యాఖ్యల్లో ఆందోళన



**న్యూఢిల్లీ, నవంబర్ 18 (డిజైనర్ టెక్ గురు ప్రతినిధి):** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు ఆ దేశానికి చెందిన అంతర్జాతీయ నేర ట్రైబ్యునల్ మరణశిక్ష విధించడంపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. హసీనాకు మరణశిక్ష విధించడం చాలా ఆందోళనకరమని ఆయన స్పష్టం చేశారు. ఒకవైపు వేరే దేశం యొక్క న్యాయవ్యవస్థ, అంతర్గత విషయాలపై తాను వ్యాఖ్యానించడం సరైనది కాదని పేర్కొన్నప్పటికీ, తాజా తీర్పు మాత్రం అంతర్జాతీయ సమాజంలో ఆందోళన కలిగించే అంశమని థరూర్ తన అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ కేసుల వెనుక రాజకీయ ప్రేరేపిత అంశాలు ఉన్నాయనే ఆరోపణల నేపథ్యంలో, ఈ తీర్పు ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. మరణశిక్ష విధించడం సరైందని తాను భావించడం లేదన్న థరూర్, ఏ కేసులో అయినా ప్రతి ఒక్కరికీ తమను తాము సమర్థించుకుంటూ వాదించుకునే అవకాశం తప్పనిసరిగా ఉండాలని, ఆ తర్వాతే ఇలాంటి కఠినమైన శిక్షలు విధించాలనే అభిప్రాయాన్ని వెలిబుచ్చారు. గత ఏడాది బంగ్లాదేశ్‌లో చోటు చేసుకున్న దేశవ్యాప్త తిరుగుబాటు నేపథ్యంలో హసీనా తన పదవికి రాజీనామా చేసి భారత్‌కు వచ్చారు. స్వాతంత్ర్య పోరాట వీరుల పిల్లలకు ప్రభుత్వ ఉద్యోగాలలో కోటా ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ ప్రారంభమైన విద్యార్థి నిరసనలు, చివరకు మహమ్మద్ యూనస్ నేతృత్వంలో మధ్యంతర ప్రభుత్వం ఏర్పాటుకు దారితీశాయి. హసీనా అధికారంలో ఉన్నప్పుడు స్వదేశంలో జరిగిన ఆందోళనలను అణిచివేసేందుకు అమానవీయంగా వ్యవహరించారనే ఆరోపణల మేరకు ఆమెపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల విచారణ అనంతరమే ఐసీటీ తాజాగా తీర్పు వెలువరించింది. ఈ ట్రైబ్యునల్ హసీనాను దోషిగా తేల్చి మరణశిక్ష విధించడం గమనార్హం. దీనితో, ప్రస్తుతం భారత్‌లో ఉన్న హసీనాను తమకు అప్పగించాలంటూ మహమ్మద్ యూనస్ నేతృత్వంలోని మధ్యంతర ప్రభుత్వం భారత్‌కు అధికారికంగా విజ్ఞప్తి చేసింది. కాగా, హసీనాపై నమోదు చేసిన కేసులు మరియు తాజా తీర్పు పక్షపాతంతో కూడినవి, పూర్తిగా రాజకీయ ప్రేరేపితమైనవి అని ఆమె పక్షం వారు మొదటి నుంచీ వాదిస్తున్నారు. ఈ మొత్తం పరిణామం బంగ్లాదేశ్ రాజకీయాలలో ఒక కీలక మలుపుగా పరిగణించబడుతోంది. హసీనా అనుచరులు, అభిమానులు ఈ తీర్పుపై తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. భారత్‌లో శరణార్థిగా ఉన్న మాజీ ప్రధానిని తిరిగి అప్పగించాలనే యూనస్ ప్రభుత్వ విజ్ఞప్తిపై భారత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందనేది ప్రస్తుతం ఉత్కంఠగా మారింది. మొత్తం మీద, బంగ్లాదేశ్‌లో ప్రజాస్వామ్య ప్రక్రియ, న్యాయవ్యవస్థ యొక్క విశ్వసనీయతపై అంతర్జాతీయంగా అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్న నేపథ్యంలో, శశిథరూర్ చేసిన వ్యాఖ్యలు ఈ వ్యవహారంలో భారతదేశం యొక్క సున్నితమైన వైఖరిని సూచిస్తున్నాయి. ఈ రాజకీయ, న్యాయపరమైన సంక్షోభం భారత-బంగ్లాదేశ్ ద్వైపాక్షిక సంబంధాలపై ఎలాంటి ప్రభావం చూపుతుందనేది తదుపరి చర్చనీయాంశంగా ఉంది. భారత్ ప్రభుత్వం తీసుకునే నిర్ణయం బంగ్లాదేశ్ యొక్క అంతర్గత రాజకీయ భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశం ఉంది.

# ఛత్తీస్‌ఘడ్‌లో నిర్బంధంతో ఎపిలోకి మావోలు

**ముందస్తు సమాచారంతోనే కూంబింగ్**

**అదే క్రమంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో హిడ్మా హతం**

**అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ వెల్లడి**

**పాడేరు,నవంబర్18:** ఛత్తీస్‌ఘడ్‌లో నిర్బంధం, దాడులు పెరగడంతోనే మావోలు ఎపి వైపు వచ్చారని, అలా ఇక్కడ ఎన్‌కౌంటర్‌కు గురయ్యారని అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ వెల్లడించారు.అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత, కేంద్ర కమిటీ సభ్యుడు హిడ్మాతోపాటు పలువురు మావోయిస్టులు మృతి చెందారని అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులపై పోలీసులు ఉక్కుపాదం మోపటం వల్ల ఆంధ్రప్రదేశ్‌లోని మారేడుమిల్లి అటవీ ప్రాంతానికి వారు చేరుకున్నారన్నారు. మావోయిస్టుల ఉద్యమాలకు ప్రజాదరణ లేదని పేర్కొన్నారు. జనజీవనస్రవంతిలోకి రావాలంటూ ఈ సందర్భంగా మావోయిస్టులకు ఆయన పిలుపు నిచ్చారు. మృతి చెందిన మావోయిస్టుల మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. ఇప్పటికే మృతి చెందిన మావోయిస్టుల కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని చెప్పారు.మం గళవారం ఉదయం 6.30 నుంచి 7.30 గంటల మధ్య ఈ ఎన్‌కౌంటర్ జరిగిందని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్ వివరాలను జిల్లా ఎస్పీ అమిత్ బర్ధర్.. వివరించారు. మరో ఐదుగురు మావోయిస్టులు ఘటనా స్థలం నుంచి తప్పించుకున్నారన్నారు. వారి కోసం కూంబింగ్ కొనసాగుతోందని చెప్పారు. మరణించిన మావోయిస్టు అగ్రనేత హిడ్మా 28 హింసాత్మక సంఘటనల్లో పాల్గొన్నారని వివరించారు. అతడిపై అనేక రివార్డులు ఉన్నాయని గుర్తు చేశారు. హిడ్మా కదలికలపై గత మూడు వారాలు నుంచే సమాచారం ఉందన్నారు. మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మావోయిస్టు అగ్రనేత హిడ్మాతోపాటు అతడి అనుచరులు మరణించారని విశాఖ రేంజ్ డీఐజీ గోపినాథ్ జెట్టి ధృవీకరించారు. మంగళవారం అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. మావోయిస్టుల కోసం కూంబింగ్ నిరంతర పక్రియగా కొనసాగుతుందన్నారు. అలాగే మావోయిస్టుల కదిలకపై నిఘా ఉంటుందని తెలిపారు. మావోయిస్టులపై ఇతర రాష్ట్రాల్లో పోలీస్ నిఘా అధికంగా ఉండడంతో అగ్రనేతలంతా ఏవోబీలోకి ప్రవేశిస్తున్నారని వివరించారు.విశాఖ రేంజ్‌లో మావోయిస్టులకు ఆశ్రమ పొందేందుకు చోటు లేదన్నారు. భవిష్యత్తు ముందని..గంజాయి వద్దని యువత ఆయన సూచించారు. గంజాయి నిర్మూలనలో భాగంగా చైతన్యం కల్పించడం కోసం అభ్యుదయ సైకిల్ యాత్ర చేపట్టామని డీఐజీ స్పష్టం చేశారు. అనంతరం నర్సీపట్నం డి.ఎస్.పి కార్యాలయంలో వార్షిక తనిఖీల్లో భాగంగా వివిధ నేర చరిత్రలపై రికార్డులను విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి పరిశీలించారు.

# నిండుగర్భిణి మృతి

**- తట్టుకోలేక భర్త ఆత్మహత్య**

**- శోకసంద్రంలో కుటుంబం**

**హైదరాబాద్,నవంబరు18:** సంతానం కలగాలని ఐవీఎఫ్ చికిత్స తీసుకుని, కవల పిల్లల కోసం ఆనందంగా ఎదురుచూస్తున్న ఆ దంపతుల జీవితం, కొద్ది గంటల్లోనే విషాదాంతమైంది. కడుపులోనే కవలలు కన్నుమూయడంతో ఆ షాక్‌కు తట్టుకోలేక నిండు గర్భిణి అయిన భార్య కూడా తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయింది. అయితే ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కనుమరుగు కావడంతో ముత్యాల విజయ్ అనే యువకుడి గుండె పగిలిపోయింది. శోకసంద్రంలో మునిగిన ఆ భర్త తన జీవితం ఇక శూన్యమని భావించి, శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే ఆత్మహత్యకు పాల్పడిన హృదయ విదారక ఘటన ఆ ప్రాంతాన్ని కన్నీటిలో ముంచేసింది. బెంగళూరుకు చెందిన ముత్యాల విజయ్ (40), అతని భార్య శ్రావ్య (35) ఏడాదిన్నర కిందట శంషాబాద్‌కు వలస వచ్చి స్థిరపడ్డారు. విజయ్ ఎయిర్‌పోర్టులో ఉద్యోగం చేస్తున్నాడు. సంతానం లేని ఈ దంపతులు ఐవీఎఫ్ చికిత్స తీసుకోవడంతో భార్య గర్భం దాల్చారు. అందులోనూ కవలలు పెరుగుతున్నారని తెలియడంతో వారి ఆనందానికి అవధులు లేవు. దాదాపు ఎనిమిది నెలల గర్భిణి అయిన శ్రావ్యతో ఆ ఇల్లు సంతోషంతో నిండిపోయింది. కవలల రాక కోసం ఇద్దరూ ఎన్నో ప్రణాళికలు వేసుకున్నారు. అయితే, 16వ తేదీ రాత్రి, శ్రావ్యకు అకస్మాత్తుగా కడుపు నొప్పి మొదలైంది. కుటుంబ సభ్యులు ఆమెను వెంటనే అత్తాపూర్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ డాక్టర్లు చెప్పిన విషయం ఆ దంపతులకు పిడుగుపాటు లాంటిది. గర్భంలో పెరుగుతున్న కవలలు ఇద్దరూ మృతి చెందారని వైద్యులు ధృవీకరించారు. ఈ వార్త తెలుసుకుని తట్టుకోలేక శ్రావ్య అక్కడే స్పృహ కోల్పోయింది. మెరుగైన వైద్యం కోసం ఆమెను గుడిమల్కాపూర్‌లోని మరో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అయితే చికిత్స పొందుతూనే శ్రావ్య తుదిశ్వాస విడిచింది. ప్రేమగా చూసుకున్న భార్య, కలలుగన్న కవలలు కొద్ది గంటల వ్యవధిలోనే దూరమవడంతో భర్త ముత్యాల విజయ్ పూర్తిగా కుంగిపోయాడు. తన జీవితాన్ని ముందుకు నడపడానికి ఉద్దేశించిన నాలుగు ప్రాణాలు కళ్లముందే కనుమరుగు కావడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోయారు. ఈ తీరని బాధతో శంషాబాద్‌లోని తమ ఇంట్లోనే విజయ్ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. దంపతు మృతితో వారి కుటుంబ సభ్యులు, బంధువులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

# పదిరోజుల పాటు వైకుంఠం ఏకాదశి దర్శనాలు

**డిసెంబర్ 30 నుంచి జనవరి 8వరకు అవకాశం**

**మొదటి మూడు రోజులు 300, శ్రీవాణి దర్శనాలు రద్దు**

**పరకామణి కేసులో కుట్రదారులను చేదించాలని తీర్మానం**

**టిటిడి బోర్డు సమావేశ వివరాలు వెల్లడించిన చైర్మన్**





**తిరుమల,నవంబర్18:** శ్రీవారి భక్తులకు శుభవార్త చెబుతూ తిరుమల తిరుపతి దేవస్థానం టీటీడీ కీలక నిర్ణయం తీసుకుంది.. తిరుమల శ్రీవారి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఈసారి పది రోజుల పాటు వైకుంఠ ద్వార దర్శనాలు కల్పించనున్నట్లు టీటీడీ ప్రకటించింది. డిసెంబర్ 30వ తేదీ నుండి వచ్చే సంవత్సరం జనవరి 8వ తేదీ వరకు భక్తులకు ఈ ప్రత్యేక దర్శనావకాశం అందుబాటులో ఉండనుంది. టిటిడి బోర్డు సమావేశ వివరాలను ఛైర్మన్ బిఆర్ నాయుడు మీడియాకు వివరించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు భక్తుల సౌలభ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈసారి సాధారణ భక్తులకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు టీటీడీ స్పష్టం చేసింది. పది రోజుల కాలంలో 182 గంటల దర్శన సమయం ఉండగా.. అందులో 164 గంటలు సాధారణ భక్తులకే ప్రత్యేకంగా కేటాయిస్తున్నట్లు టీటీడీ తెలిపింది. మొదటి 3 రోజులు రూ.300, శ్రీవాణి దర్శనాలు రద్దు చేస్తున్నట్టు ప్రకటించింది.. వైకుంఠ దర్శనాల ప్రారంభయ్యే మూడు రోజులు రూ.300 దర్శనం, శ్రీవాణి దర్శనం రద్దు చేయబడ్డాయని.. జనవరి 2 నుండి టికెట్ కేటాయింపు ఉంటుందని ప్రకటించింది.. జనవరి 2వ తేదీ నుంచి 8వ తేదీ వరకు రూ.300 దర్శన టికెట్లు 15,000 వేల చొప్పున విడుదల చేయనున్నారు.. శ్రీవాణి దర్శనాలకు సంబంధించిన టికెట్లు 1,000 చొప్పున అందుబాటులో ఉంచుతారు.. ఈ టికెట్లు సాధారణ పద్ధతిలో ఆన్‌లైన్ ద్వారా జారీ అవుతాయి. మొదటి మూడు రోజులకు ఈ-డిప్ సిస్టమ్ ద్వారా అంటే, డిసెంబర్ 30, 31 మరియు జనవరి 1వ తేదీల దర్శనాలకు అనుమతి ఇస్తారు.. ఈ-డిప్ ద్వారా టికెట్లు కేటాయింపు జరుగుతుంది. నవంబర్ 27 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు రిజిస్ట్రేన్ అవకాశం ఉంటుంది..

డిసెంబర్ 2న లాటరీ విధానంలో ఎంపికైన వారికి టోకెన్ల కేటాయిస్తారు.. టీటీడీ వెబ్‌సైట్‌తో పాటు.. మొబైల్ యాప్, వాట్సాప్ సిస్టమ్ ద్వారా కూడా రిజిస్ట్రేషన్, టోకెన్ కేటాయింపు పారదర్శకంగా జరుగుతుందని అధికారులు తెలిపారు. వైకుంఠ ద్వారా దర్శనం సందర్భంగా స్థానికులకు ప్రత్యేక కేటాయింపులు చేసింది టీటీడీ.. తిరుమల?తిరుపతి ప్రాంత భక్తులకు.. జనవరి 6, 7, 8 తేదీల్లో రోజుకి 5,000 టోకెన్లు కేటాయించ నున్నారు. ఈ ఏడాది వైకుంఠ దర్శనాల సందర్భంగా వీఐపీ బ్రేక్ దర్శనం, ప్రత్యేక దర్శనం ఏడు రోజులపాటు రద్దు చేయబడింది. అత్యవసరంగా వచ్చే ప్రముఖులకు మాత్రమే దర్శనం కల్పించబడుతుంది అని టీటీడీ స్పష్టం చేసింది.. క్యూలైన్‌లో నేరుగా నిల్చుని వచ్చే భక్తులకు కూడా వైకుంఠ ద్వార దర్శనం ఏర్పాట్లు చేస్తున్నట్లు టీటీడీ తెలిపింది. తిరుమలలో భారీ సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో టీటీడీ అన్ని ఏర్పాట్లు ముమ్మరం చేసింది. కాగా, వైకుంఠ ద్వారా దర్శనానికి ప్రతీ ఏడాది భక్తులు తిరుమలకు పెద్ద సంఖ్యలు తరలివచ్చే విషయం విదితమే. ఇకపోతే పరకామణి కేసులో దోషులను కఠినంగా శిక్షించాలని, ఎవ్వరినీ వదలరాదని బోర్డు కోరింది.తితిదే ధర్మకర్తల మండలి సమావేశంలో కీలక తీర్మానం చేశారు. పరకామణి చోరీ ఘటనపై మరోసారి పోలీసులకు ఫిర్యాదు చేయాలని, లోక్ అదాలత్‌లో రాజీ వెనుక కుట్రదారులను తేల్చేలా విచారణ జరపాలని తీర్మానం చేశారు. గతంలో నమోదైన కేసు పరిధి పరిమితంగా ఉండటంతోపాటు, ఇటీవల కాలంలోనూ మరికొన్ని చోరీ ఘటనల దృష్ట్యా మరో కేసు నమోదు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు తిరుమల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తీర్మానించారు. అలాగే అమరావతిలో వేంకటేశ్వరాలయం శంకుస్థాపనలో సిఎం పాల్గొంటారని ఛైర్మన్ బిఆర్ నాయుడు తెలిపారు.

# జల్ సంచయ్ జన్ భాగీదారీ అవార్డులు

**అగ్రస్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్రం**

**కేంద్ర జలశక్తి శాఖ ప్రకటన**







**న్యూఢిల్లీ,నవంబర్18:** జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. కేంద్ర జలశక్తి శాఖ ప్రకటించిన ఆరో జాతీయ జల అవార్డులు- 2024లో జాతీయ స్థాయిలో తెలంగాణ తొలి ర్యాంకును సాధించింది. కేంద్ర ప్రభుత్వం- 2024లో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. తెలంగాణ వ్యాప్తంగా మొత్తం 5,20,362 పనులని పూర్తిచేసింది. జల్ సంచయ్ జన్ భాగీదారీ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన రాష్ట్రాలకు భారతదేశ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం పురస్కారాలు ప్రదానం చేశారు. జల్ సంచయ్ జన్ భాగీదారీని ఉత్తమంగా అమలు చేసిన రాష్ట్రాలు, జిల్లాలు, స్థానిక సంస్థలకు కేందప్రభుత్వం 100 అవార్డులను ప్రకటించింది. ఇందులో మూడు రాష్ట్రాలు, 67 జిల్లాలు, 6 మున్సిపల్ కార్పొరేషన్లు, ఒక పట్టణ స్థానిక సంస్థ, రెండు భాగస్వామ్య మంత్రిత్వ శాఖలు/విభాగాలు, రెండు పరిశ్రమలు, మూడు ఎన్‌జీఓలు, ఇద్దరు దాతలు, 14 మంది నోడల్ అధికారులు ఉన్నారు. క్షేత్రస్థాయిలో జల సంరక్షణలో ప్రజలు, సంఘాలు, కార్పొరేట్ సంస్థలను భాగస్వాములను చేసే లక్ష్యంతో ప్రారంభించిన ఈ కార్యక్రమం కింద.. రాష్ట్రాలను ఐదు జోన్లుగా విభజించారు. ప్రతి ఒక్కరూ కనీసం 10 వేల కృత్రిమ రీఛార్జి, స్టోరేజ్ నిర్మాణాలు చేపట్టాలని లక్ష్యంగా నిర్దేశిరచారు. ఇందులో రూఫ్‌టాప్ వాన నీటి సంరక్షణ, చెరువులు, కుంటలు, బావుల పునరుద్ధరణ కార్యక్రమాలను చేర్చారు. మంచి పనితీరు కనబరిచిన రాష్ట్రాలు, జిల్లాలు, మున్సిపల్ కార్పొరేషన్లను మూడు కేటగిరీలుగా విభజించి అవార్డులు ప్రకటించారు. మొదటి కేటగిరీలో ఎంపికైన వాటికి రూ.2 కోట్లు, రెండో కేటగిరీలో కోటి రూపాయలు, మూడో కేటగిరీలో రూ.25 లక్షల నగదు బహుమతి ప్రకటించారు. జిల్లాల విభాగంలో కేటగిరీ-1 కింద దక్షిణ జోన్ నుంచి మూడు జిల్లాలను ఎంపిక చేయగా.. ఆ మూడింటినీ తెలంగాణ రాష్ట్రం కైవసం చేసుకుంది. ఒక్కో జిల్లాకు రూ.2 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్ల నగదు బహుమతి అందజేసింది. ఆదిలాబాద్, నల్గొండ, మంచిర్యాల జిల్లాలు ఈ నగదు బహుమతిని సాధించాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) ఏరియాలో జల సంరక్షణ చర్యలు చేపట్టినందుకు.. హైదరాబాద్ మెట్రో కార్పొరేషన్ నీటి సరఫరా, మురుగునీటి బోర్డు మున్సిపల్ కార్పొరేషన్ల విభాగంలో రెండో ర్యాంకు సాధించింది. రూ.2 కోట్ల నగదు బహుమతిని సొంతం చేసుకొంది. ఈ విభాగంలో కేటగిరీ-2లో వరంగల్, నిర్మల్, జనగామ, జిల్లాలు దక్షిణ జోన్‌లో తొలి మూడు స్థానాల్లో నిలిచి రూ.కోటి చొప్పున బహుమతి గెలుచుకున్నాయి.కేటగిరీ-3లో భద్రాద్రి కొత్తగూడెం, మహబూబ్‌నగర్ 1, 3 ర్యాంకుల్లో నిలిచి.. రూ.25 లక్షల చొప్పున నగదు బహుమతి సొంతం చేసుకున్నాయి. ఆదిలాబాద్, జగిత్యాల, కామారెడ్డి, కుమురం భీం ఆసిఫాబాద్, మెదక్, నిర్మల్, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలకు నోడల్ అధికారిగా వ్యవహరించిన కేంద్ర జల సంఘానికి చెందిన ఎ.సతీశ్‌కు కూడా అవార్డు దక్కింది.

# నేరడిగొండలో కొనుగోలు కేంద్రాల పరిశీలన

**అధైర్యపడకండి... అన్నదాతలకు అండగా ఉంటాం**

**మళ్లీ వచ్చేది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నకెటిఆర్**

**ఆదిలాబాద్,నవంబరు18:** రైతులు ఎవరూ అధైర్య పడకండి, మీకు అండగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఎల్లవేళలా అండగా ఉంటామని రైతులకు కేటీఆర్ ధైర్యం చెప్పారు. మళ్ళీ బీఆర్ఎస్సే అధికారంలోకి వస్తుంది.. రైతుల సమస్యలు పరిష్కారం చేస్తామని ఆయన అన్నారు. కేసీఆర్ హయాంలో రైతులకు ఎటువంటి కష్టం లేకుండా చూసుకున్నామని, ఊరూరా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రతీ ధాన్యం గింజ కొన్నామని కేటీఆర్ గుర్తుచేశారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నేరడిగొండ జిన్నింగ్ మిల్లు వద్ద సోయాబీన్, మొక్కజొన్న పంట కొనుగోలు కేంద్రాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మళ్లీ బీఆర్ఎస్ పార్టీనే అధికారంలోకి వస్తుందని, రైతుల సమస్యలను పరిష్కరిస్తుందని కేటీఆర్ అన్నారు. రైతులు అధైర్య పడకూడదని, రైతులకు అండగా బీఆర్ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# ఈ సీజన్‌లోనూ కెప్టెన్‌గా పాట్ కమిన్స్ే !



సన్ రైజర్స్ హైదరాబాద్ జట్టుకు కొత్త కెప్టెన్‌ను నియమిస్తారనే ప్రచారానికి యాజమాన్యం ఫుల్?స్టాప్? పెట్టింది. వచ్చే %ఖూా% సీజన్?లోనూ పాట్? కమిన్స్ే కెప్టెన్?గా ఉంటారంటూ సోషల్? మీడియాలో ఓ పోస్టర్?ను షేర్? చేసింది. గతంలో కూడా సన్?రైజర్స్? హైదరాబాద్? తమ కెప్టెన్ పేరును ధ్రువీకరించింది. కానీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. తాజాగా సోమవారం నవంబర్ 17న, ఫ్రాంచైజీ తన '%శ%' హ్యాండిల్‌లో ఆస్ట్రేలియన్ పాట్ కమిన్స్?ను మూడోసారి %బా=ఎ% కెప్టెన్‌గా కొనసాగుతారని స్పష్టం చేసింది.దీంతో వరుసగా మూడోసారి ఫ్రాంచైజీ పగ్గాలు చేపట్టనున్నారు. ఇదిలా ఉండగా కమిన్స్? ప్రస్తుతం వెన్ను గాయం నుంచి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నాడు. గాయం కారణంగా యాషెస్? టెస్ట్?కు దూరమయ్యాడు. దీంతో నవంబర్? 21 నుంచి ఇంగ్లాండ్?తో ప్రారంభమయ్యే సిరీస్? ఓపెనర్?లో స్టీవ్?స్మిత్? ఆస్ట్రేలియాకు కెప్టెన్?గా వ్యవహరించనున్నాడు. అయితే డిసెంబర్? 4 నుంచి బ్రిస్బేన్?లో ప్రారంభమయ్యే రెండో టెస్ట్?కు పాట్? కమిన్స్? ఫిట్?గా ఉంటాడని అంతా భావిస్తున్నారు. సన్‌రైజర్స్ హైదరాబాద్ 2026 ఐపీఎల్ కోసం తమ జట్టును నియమించుకొని, అందులో ఎనిమిది మందిని పేర్లు ప్రకటించింది. వారు మహమ్మద్ షమీని లఖ్?నవూకు రూ.10 కోట్లకు (100 మిలియన్ రూపాయలు) కొనుగోలు చేశారు. వారు ఆడమ్ జంపా, రాహుల్ చాహర్, వియాన్ ముల్డర్‌తో సహా అనేక మంది ఆటగాళ్లు ఉన్నారు. మినీ-వేలంలో ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి సన్‌రైజర్స్ వద్ద ఇప్పుడు ?25.50 కోట్లు మిగిలి ఉన్నాయి. దీని వల్ల జట్టు స్లాట్‌లను పూరించడానికి మరో 10 మంది ఆటగాళ్లను పొందేందుకు వీలు కలుగుతుంది. ఎందుకంటే నియమాలు ప్రతి జట్టు గరిష్ఠంగా 25 మంది ఆటగాళ్లను కొనుగోలు చేయడానికి అనుమతిస్తాయి. ఇటీవలి సీజన్లలో బాగా రాణించిన కోర్ జట్టును నిలుపుకుంది. కమిన్స్? కెప్టెన్సీలో, హైదరాబాద్ 2024 లో రన్నరప్‌గా నిలిచింది. కానీ 2025 సీజన్‌లో తమ ప్రదర్శనను కొనసాగించడంలో విఫలమై ప్లేఆఫ్‌కు అర్హత సాధించలేకపోయింది. ఆ జట్టు 14 మ్యాచ్‌ల్లో ఆరు విజయాలు, ఏడు ఓటములు, ఒక డ్రాతో ఆరో స్థానంలో నిలిచింది.ఇదిలా ఉండగా ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న పాట్ కమిన్స్ 2014లో సన్‌రైజర్స్ కెప్టెన్సీని చేపట్టాడు.

అంతకుముందు కోల్?కతా నైట్? రైడర్స్?, దిల్లీ క్యాపిటల్స్?కు ప్రాతినిధ్యం వహించాడు. 2024 కి ముందు కమిన్స్ సన్‌రైజర్స్ కెప్టెన్‌గా నియమితులయ్యారు. ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్, 2023 %బాణ×% ప్రపంచ కప్ విజయం తర్వాత, 2024 వేలంలో ఆస్ట్రేలియన్ ఆటగాడు ఐడెన్ మార్క్రామ్ తర్వాత ఆయన స్థానంలో కమిన్స్? బాధ్యతలు స్వీకరించాడు. అతని సారథ్యంలో 2024లో ఫైనల్? చేరిన సన్‌రైజర్స్, 2025లో ఆరోస్థానంలో నిలిచింది. మొత్తంగా కమిన్స్? కెప్టెన్సీలో 30 మ్యాచ్?లు ఆడగా అందులో 15 గెలిచి, 14 ఓడింది. ఓ మ్యాచ్?లోనైతే ఫలితం తేలనేలేదు.

# వన్డేల సిరీస్‌కు కెప్టెన్ పై సందిగ్ధత



సౌతాఫ్రికాతో జరగబోయే కీలకమైన వైట్-బాల్ సిరీస్‌కు ముందు టీమిండియాకు కెప్టెన్సీ సమస్య ఎదురైంది. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ గాయం కారణంగా ఇప్పటికే తొలి టెస్ట్ నుంచి తప్పుకోగా, రెండో టెస్టుకు కూడా అందుబాటులో ఉండే అవకాశం లేదు. దీంతో రాబోయే మూడు వన్డేల సిరీస్‌కు కెప్టెన్‌గా ఎవర్ని సెలక్ట్ చేయాలనే దానిపై సందిగ్ధత నెలకొంది. గాయం కారణంగా గిల్ దూరమైన నేపథ్యంలో, వైస్-కెప్టెన్ కూడా అందుబాటులో లేకపోవడంతో కెప్టెన్సీ రేసులో ఇద్దరు సీనియర్ ఆటగాళ్లు ముందున్నారు.

భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గాయం కారణంగా దక్షిణాఫ్రికా టెస్ట్ సిరీస్‌కు దూరమయ్యే పరిస్థితి కనిపిస్తోంది. కోల్‌కతాలో జరిగిన తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో స్వీప్ షాట్ ఆడుతున్నప్పుడు గిల్ మెడలో నొప్పి రావడంతో కేవలం మూడు బంతులు మాత్రమే ఆడి మైదానాన్ని వీడాడు. బీసీసీఐ ప్రకారం, గిల్‌కు మెడ పట్టేయడం జరిగింది. దీంతో తొలి టెస్టుకు పూర్తిగా నవంబర్ 22న గౌహతిలో ప్రారంభం కానున్న రెండో టెస్టుకు కూడా గిల్ దూరమయ్యే అవకాశం ఉంది. గిల్ ఫిట్‌నెస్ సమస్యల నేపథ్యంలో యువ ఆల్-రౌండర్ నితీష్ కుమార్ రెడ్డిని జట్టులోకి తీసుకున్నారు. రెండో టెస్టు ఇంకా ప్రారంభం కాకముందే, నవంబర్ 30న రాంచీలో మొదలు కానున్న మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌పై దృష్టి మళ్లింది. సిరీస్ కోసం జట్టును త్వరలోనే ప్రకటించనున్నారు. రెగ్యులర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వన్డే సిరీస్‌కు కూడా అందుబాటులో ఉండకపోవచ్చు. అలాగే వైస్-కెప్టెన్‌గా ఉన్న శ్రేయాస్ అయ్యర్ కూడా గాయం కారణంగా దూరంగా ఉండటంతో కెప్టెన్సీపై క్లారిటీ లేదు. దీనితో టెస్ట్ వైస్-కెప్టెన్ రిషభ్ పంత్, సీనియర్ ఆటగాడు కేఎల్ రాహుల్ కెప్టెన్సీ రేసులో ప్రధాన పోటీదారులుగా నిలిచారు. జట్టులో రాహుల్‌కు ఉన్న అనుభవం, సీనియారిటీని దృష్టిలో ఉంచుకుని అతనికి కెప్టెన్సీ బాధ్యతలు అప్పగించే అవకాశం ఎక్కువగా ఉంది. నిరంతరం అన్ని ఫార్మాట్లలో ఆడుతున్నందున గిల్‌కు ఈ సిరీస్‌లో విశ్రాంతినిచ్చి టీ20 సిరీస్‌కు సిద్ధం చేసే అవకాశం కూడా ఉంది. సౌతాఫ్రికాతో జరగబోయే ఈ వన్డే సిరీస్‌తో ఆల్‌రౌండర్లు హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా తిరిగి జట్టులోకి రానున్నారు. ఈ సిరీస్ విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలకు చాలా కీలకం. ఆస్ట్రేలియా పర్యటనలో తమ ఫామ్ నిరూపించుకున్నప్పటికీ వారు స్థిరంగా రాణించాల్సిన అవసరం ఉంది. వరల్డ్ కప్ 2027 కోసం పోటీలో ఉండాలంటే, సౌతాఫ్రికాపై ఆ తర్వాత వచ్చే మ్యాచ్‌లలో వారి మంచి ప్రదర్శన చాలా ముఖ్యమైనది. మిగిలిన వన్డే మ్యాచ్‌లు డిసెంబర్ 3న రాయ్‌పూర్, డిసెంబర్ 6న విశాఖపట్నంలో జరగనున్నాయి. వన్డేల తర్వాత ఇరు జట్ల మధ్య ఐదు టీ20 మ్యాచ్‌ల సిరీస్ కూడా ఉంది.

# రెండో టెస్ట్ కోసం ప్యాడ్‌ను తీసేసి ప్రాక్టీస్!



సౌతాఫ్రికాతో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో టీమ్ ఇండియా 30 పరుగుల తేడాతో ఓడిపోయిన విషయం తెలిసిందే. ఈ మ్యాచ్‌లో భారత బ్యాట్స్‌మెన్‌లు సౌతాఫ్రికా స్పిన్నర్ల బౌలింగ్‌లో పరుగులు తీయడానికి చాలా కష్టపడ్డారు. ఈ సమస్యను అధిగమించేందుకు భారత జట్టు ఇప్పుడు వినూత్నంగా, చాలా సాహసోపేతమైన ప్రాక్టీస్ విధానాన్ని మొదలుపెట్టింది.

ఈ స్పెషల్ ట్రైనింగులో ఆటగాళ్లకు గాయాలయ్యే ప్రమాదం ఉన్నా, దాన్ని లెక్కచేయకుండా బ్యాటర్లు ముమ్మరంగా సాధన చేస్తున్నారు. గువహాతిలో నవంబర్ 22 నుంచి జరగబోయే రెండో టెస్టుకు ముందు టీమ్ ఇండియా అనుసరిస్తున్న ఈ గంభీరమైన ప్లాన్ వివరాలు చూద్దాం. కోల్‌కతాలో జరిగిన మొదటి టెస్టులో వైఫల్యం తర్వాత, భారత బ్యాటర్లు ప్రత్యేకంగా స్పిన్నర్లను ఎదుర్కోవడానికి ఒక వినూత్న వ్యూహాన్ని అనుసరించారు. బ్యాట్స్‌మెన్‌లు ఒక ప్యాడ్‌ను తీసేసి (ముందు కాలుకు ఉండే ప్యాడ్) సుమారు మూడు గంటల పాటు స్పిన్నర్ల బౌలింగ్‌ను ఎదుర్కొని ప్రాక్టీస్ చేశారు. ముందు కాలుకు ప్యాడ్ లేకుండా బ్యాటింగ్ చేయడం అంటే, బంతి కాలికి లేదా ఇతర భాగాలకు తగిలితే గాయమయ్యే ప్రమాదం ఉంటుంది. ఇది ఒక పాత పద్ధతి. దీని ద్వారా బ్యాట్స్‌మెన్‌లు బంతిని కేవలం తమ ముందు ప్యాడ్‌తో అడ్డుకోవడానికి ప్రయత్నించకుండా, బ్యాట్‌ను మాత్రమే ఉపయోగించి ఆడటానికి అలవాటు పడతారు. భారత లెఫ్ట్ హ్యాండర్లలో బ్యాక్ ఫుట్‌పైకి వెళ్లి ఆడే ధోరణి ఎక్కువగా ఉంటుంది. ఈ ప్రాక్టీస్ వారికి స్పిన్నర్ల బౌలింగ్‌ను ముందుకు వచ్చి ఆడటానికి, ప్యాడ్‌ను కాకుండా బ్యాట్‌ను ఎక్కువగా ఉపయోగించడానికి సహాయపడుతుంది. సోమవారం జరిగిన ఐచ్ఛిక ప్రాక్టీస్ సెషన్‌కు సీనియర్ సభ్యుల్లో రవీంద్ర జడేజా సహా కేవలం ఆరుగురు ఆటగాళ్లు మాత్రమే హాజరయ్యారు. లెఫ్ట్ హ్యాండర్ సాయి సుదర్శన్ ముందు కాలుకు ప్యాడ్ లేకుండా దాదాపు మూడు గంటల పాటు సాధన చేశాడు. భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మెడ గాయం కారణంగా రెండో టెస్ట్‌కు దూరమయ్యే అవకాశం ఉండటంతో, సుదర్శన్ అతని స్థానాన్ని భర్తీ చేసే ఛాన్స్ ఉంది. మొదటి టెస్ట్‌లో స్పెషలిస్ట్ బ్యాట్స్‌మెన్‌గా ఆడి, ఆశించిన స్థాయిలో రాణించని ధ్రువ్ జురెల్ కూడా సుదర్శన్ లాగే ఒక ప్యాడ్ తీసి ప్రాక్టీస్ చేశాడు. గువహతి టెస్ట్‌లో కూడా టీమ్ మేనేజ్‌మెంట్ అతన్ని అదే పాత్రలో కొనసాగించే అవకాశం ఉంది. ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్, బ్యాటింగ్ కోచ్ సీతాంశు కోటక్ దగ్గరుండి సుదర్శన్ ప్రాక్టీస్‌ను పర్యవేక్షించారు. బ్రేక్ సమయంలో గంభీర్ వారిద్దరితో ఎక్కువ సమయం మాట్లాడటం కనిపించింది.

స్పిన్నర్లకు వ్యతిరేకంగా ధైర్యంగా ఆడినప్పటికీ, ఈ ఇద్దరు బ్యాటర్లు పేస్ బౌలర్లను ఎదుర్కోవడంలో మాత్రం కొద్దిగా ఇబ్బంది పడ్డారు. పేస్ బౌలర్ల ముందు సుదర్శన్, జురెల్ అప్పుడప్పుడు ఇబ్బంది పడ్డారు. నెట్ బౌలర్ల స్వింగ్ బంతులకు కూడా వారి బ్యాట్‌కు ఎడ్జ్ తగలడం గమనించవచ్చు. గిల్ రెండో టెస్ట్ ఆడటం దాదాపు అసాధ్యం కావడంతో, యువ ఆల్‌రౌండర్ నితీష్ రెడ్డిని సౌత్ ఆఫ్రికా ఎ తో జరుగుతున్న ఇండియా ఎ సిరీస్ నుంచి వెనక్కి పిలిపించి, కోల్‌కతాకు తీసుకువచ్చారు. అయితే, అతను ఈ ప్రాక్టీస్ సెషన్‌లో పాల్గొనలేదు.

# టెస్ట్ క్రికెట్‌ను ఖూనీ చేస్తున్నారు

## మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్



కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్ట్‌లో టీమిండియా ఎదుర్కొన్న పరాజయంపై మాజీ స్పిన్నర్ హర్భజన్ సింగ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కేవలం 124 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని ఛేదించలేక టీమిండియా 93 పరుగులకే కుప్పకూలడంపై ఆయన ఘాటుగా స్పందించారు. ఇలాంటి ర్యాంక్ టర్నర్లను తయారు చేస్తూ టెస్ట్ క్రికెట్‌ను పూర్తిగా నాశనం చేస్తున్నారని జట్టు యాజమాన్యంపై మండిపడ్డారు.దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ ఓటమి అనంతరం తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన హర్భజన్ సింగ్.. "టెస్ట్ క్రికెట్‌కు %=ఖూ% (రెస్ట్ ఇన్ పీస్). వారు ఈ ఫార్మాట్‌ను పూర్తిగా నాశనం చేశారు. కొన్నేళ్లుగా ఇలాంటి పిచ్‌లు తయారు చేస్తున్నారు. జట్టు గెలుస్తోంది కాబట్టి ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదు. కానీ ఇది సరైన పద్ధతి కాదు" అని ఆరోపించారు.దక్షిణాఫ్రికాతో తొలి టెస్ట్ ఓటమి అనంతరం తన యూట్యూబ్ ఛానెల్‌లో మాట్లాడిన హర్భజన్ సింగ్.. "టెస్ట్ క్రికెట్‌కు %=ఖూ% (రెస్ట్ ఇన్ పీస్). వారు ఈ ఫార్మాట్‌ను పూర్తిగా నాశనం చేశారు. కొన్నేళ్లుగా ఇలాంటి పిచ్‌లు తయారు చేస్తున్నారు. జట్టు గెలుస్తోంది కాబట్టి ఎవరూ దీని గురించి మాట్లాడటం లేదు. కానీ ఇది సరైన పద్ధతి కాదు" అని ఆరోపించారు.ఇలాంటి పిచ్‌లపై ఆడటం వల్ల ఆటగాళ్లు ఏ మాత్రం ఎదగరని హర్భజన్ అభిప్రాయపడ్డారు. మీరు గానుగెద్దులా ఒకేచోట తిరుగుతున్నారే తప్ప ముందుకు వెళ్లడం లేదని భజ్జీ మండిపడ్డారు. బ్యాటర్లకు పరుగులు ఎలా చేయాలో కూడా తెలియని విధంగా పిచ్‌లను తయారుచేస్తున్నారని అన్నారు. నైపుణ్యంతో కాకుండా పిచ్ వల్లే వికెట్లు పడుతుంటే.. సమర్థుడైన బౌలర్‌కు, బ్యాటర్‌కు తేడా ఏముంటుందని ఆయన ప్రశ్నించారు.తొలి టెస్టులో రెండో రోజే 15 వికెట్లు పడటం, మూడో రోజు రెండు సెషన్లలోపే మ్యాచ్ ముగియడంతో పిచ్‌పై సర్వత్ర విమర్శలు వెల్లువెత్తాయి.

# బవుమా అరుదైన రికార్డు..

సొంతగడ్డ స్పిన్ పిచ్ మనకు అడ్డా! అలాంటి చోట, 124 పరుగుల టార్గెట్‌ను ఛేదించలేక టీమ్?ఇండియా కుప్పకూలడం ఫ్యాన్స్‌కు పెద్ద షాక్. 15 ఏళ్ల తర్వాత మన గడ్డపై సౌతాఫ్రికా టెస్ట్ గెలిచి చరిత్ర సృష్టించింది. అయితే, ఈ ఓటమి కంటే ఎక్కువగా ఇప్పుడు సౌతాఫ్రికా కెప్టెన్ గురించే పెద్ద చర్చ నడుస్తోంది. అతను కెప్టెన్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క టెస్ట్ మ్యాచ్ కూడా ఓడిపోలేదు. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో కూడా గెలిచాడు.సౌతాఫ్రికా కెప్టెన్ టెంబా బవుమా ఒక అరుదైన రికార్డును కొనసాగిస్తున్నాడు. అతను టెస్ట్ కెప్టెన్ అయినప్పటి నుంచి ఇప్పటి వరకు సౌతాఫ్రికా ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోలేదు. బవుమా మొత్తం 11 టెస్టులకు నాయకత్వం వహించగా, అందులో 10 మ్యాచ్‌లలో సౌతాఫ్రికా గెలిచింది, మరో మ్యాచ్ డ్రాగా ముగిసింది. అతని కెప్టెన్సీలోనే ఆస్ట్రేలియాపై డబ్ల్యూటీసీ ఫైనల్ కూడా గెలిచారు. ఇప్పుడు టీమ్?ఇండియా లాంటి బలమైన జట్టును సొంత గడ్డపై ఓడించి, తన అజేయమైన రికార్డును కొనసాగించడం విశేషం.ఈ మ్యాచ్ ఓటమికి

పూర్తిగా భారత బ్యాటర్లదే బాధ్యత. 124 పరుగుల స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమ్?ఇండియా, కేవలం 93 పరుగులకే కుప్పకూలింది. 30 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. మన టాప్ ఆర్డర్ పూర్తిగా ఫెయిల్ అయింది. యశస్వి జైస్వాల్ (0), కేఎల్ రాహుల్ (1), కెప్టెన్ రిషభ్ పంత్ (2), ధ్రువ్ జురెల్ (13) దారుణంగా విఫలమయ్యారు. చివర్లో వాషింగ్టన్ సుందర్ (31), రవీంద్ర జడేజా (18), అక్షర్ పటేల్ (26) కాసేపు పోరాడినా, అది విజయానికి సరిపోలేదు. స్పిన్ పిచ్‌పై సౌతాఫ్రికా స్పిన్నర్లు చెలరేగిపోయారు.ఈ పిచ్‌ను ఇండియా స్పిన్నర్లు (జడేజా, అక్షర్, కుల్దీప్) కోసం తయారుచేశారు. కానీ, మన స్పిన్నర్ల కంటే సౌతాఫ్రికా స్పిన్నర్ సైమన్ హర్మర్ అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఈ మ్యాచ్‌లో మొత్తం 8 వికెట్లు పడగొట్టి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. మరోవైపు కేశవ్ మహారాజ్ కూడా కీలక వికెట్లు తీశాడు. మన బ్యాటర్లు సొంత పిచ్‌పైనే స్పిన్‌ను ఆడలేక చేతులెత్తేయడం విమర్శలకు తావిస్తోంది.

Published and printed by; MUKESH VEERANTI.TEL NO;T/TG/619.2024.Cell no ;9398236146.8328649322.gmail.Thovvanews@gmail.com Head office:THOVVA NEWS.#5-70/5/4. PLOT NO 36.SAI MAHADEV NAGAR.PARVATHAPUR.MEDIPALLI. FIZADHIGUDAMEDCHAL MALKAJGIRI..Pin.5000399398236146

# మాదకద్రవ్యాల నిర్మూలనకు సహకరించాలి,



### కన్న తల్లిదండ్రులను దృష్టిలో పెట్టుకొని యువత మెలగాలి,

### యువత ఉండే పద్ధతుల ద్వారా 25 సం ల్లో భవిష్యత్తు నిర్ణయం,

### సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ గండ్రాతి సతీష్,

**తొవ్వ న్యూస్ ప్రతినిధి, కురవి నవంబర్ 18,**



యువత తమ భవిష్యత్తును 25 సంవత్సరాల వయసు వరకు జీవితాన్ని ఎలా ఉంచాలో ఎలా ఉండాలో నిర్ణయిస్తుందని సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ సతీష్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆలయ సెంటర్లో యువత తో మాదకద్రవ్యాలపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సుధీర్ రామనాథ్ కేకన్ ఆదేశాల మేరకు మాదకద్రవ్యాలపై యువతలో చైతన్యం తీసుకొస్తున్నామని తెలిపారు. యువత తమ భవిష్యత్తును 25 సంవత్సరాల లోనే తీర్చిదిద్దుకోవాలని భవిష్యత్తు ఎలా ఉండాలో ఎలా ఉంచుకోవాలనో నిర్ణయించేది 25 సంవత్సరాల వయసు లోపు అని, అలా కాకుండా మాదకద్రవ్యాల వైపు అలవాటు పడి చెడు వ్యసనాలకు బానిసై యువత తమ జీవితాన్ని ఆగం చేసుకుంటుందని కుటుంబంలోని తల్లిదండ్రులతో పాటు తన తోబుట్టువులు బంధువులు దగ్గర విలువ లేకుండా పోతున్నారని అన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడి పలు రోగాలను తెచ్చుకొని కన్న తలదండ్రులకు కడుపు కోత మిగులుస్తున్నారని అన్నారు. వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఆదుకుంటాడని గంపెడు ఆశతో వృద్ధాప్యంలో ఉన్న అమ్మానాన్నలు గుండె ధైర్యంతో ఉంటున్నారని అన్నారు. ఇప్పుడు చిన్న వయసులోనే కడుపున పుట్టిన కొడుకులు మద్యం కు బానిసై చదువు లేక పని లేక జులాయి గా తిరుగుతూ ఉంటే కన్న తల్లిదండ్రుల ఆవేదన యువతకు అర్థం కావడం లేదని అన్నారు. ఇప్పటికైనా యువత తమ జీవితం తమ చేతుల్లోనే ఉందని ఆలోచనతో జీవితాన్ని అందంగా మలుచుకొని కుటుంబ సభ్యులతో సత్ప్రవర్తన కలిగి ఉండాలని అన్నారు.

## యువత సహకరించాలి

మాదకద్రవ్యాలు సరఫరా చేసే వారిని అంతమొందించాలంటే యువత సహకరించాలని గంజాయి గుడుంబా ఇతర మాదకద్రవ్యాలు అక్రమ వ్యాపారాలు పిడిఎస్ రైస్ నల్లబెల్లం పట్టిక లాంటివి సరఫరా చేసే వారి ఆచూకీ తెలిపితే తెలిపిన వారి పేర్లను గోప్యంగా ఉంచి వారికి మంచి బహుమతులు ఇస్తామని తెలిపారు. ఈరోజు నుంచి మద్యానికి యువత దూరంగా ఉంటానని ప్రతిజ్ఞ చేయాలని ఆయన కోరగానే యువకులు అందరూ ఈరోజు నుంచి వీరభద్ర స్వామి సాక్షిగా మద్యానికి దూరంగా ఉంటాము మాదకద్రవ్యాలు సరఫరా చేసేవారు మా కంటికి కనిపిస్తే మీకు వెంటనే సమాచారం ఇస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి అవిర మోహన్రావు, మండల పార్టీ ఉపాధ్యక్షులు బాలగాని శ్రీనివాస్. టిఆర్ఎస్ గ్రామ పార్టీ అధ్యక్షులు నిమ్మలగంటి కృష్ణమూర్తి, దడిగల నరసయ్య. బీసీ ఉమెన్ గాదేపల్లి అనిత. హెచ్ సి వెంకటయ్య. వీరన్న. సుధాకర్. రమణాచారి. నాగబాబు. లచ్చు. సంపత్. లక్ష్మణ్. తదితరులు పాల్గొన్నారు.

## చలి తీవ్రతకు ప్రజలు జాగ్రత్తగా ఉండాలి



**తొవ్వ, ప్రతినిధి, ఇబ్రహీంపట్నం, నవంబర్ 18**

మంచాల మండలంఆరుట్ల గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్లో పిల్లలకు తీసుకోవచ్చా జాగ్రత్తల మీద అవేర్నెస్ ప్రోగ్రాం నిర్వహించడం జరిగింది స్కూల్ హెచ్ఎం గిరిధర్ గౌడ్, డాక్టర్ దీపిక డాక్టర్ వెంకట్ రాజ్, చలి తీవ్రంగా ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలు చేతులు శుభ్రంగా కడుక్కోవాలి చాల సేపు మౌత్ వాష్ చేసుకుని తర్వాత వేడినీళ్లతో స్నానం వేడివేడి ఆహారం గోరువెచ్చటి నీళ్లు ఉతికిన బట్టలు ధరించాలి మలేరియా డెంగ్యూ లాంటి వ్యాధులు చలికాలంలో మట్టిలో ఆడకూడదు ఒక మంచి విద్యార్థులుగా అన్ని అలవాట్లు తెలుసుకోవాలని తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఇంటర్నేషనల్ స్థాయిలో ఇసుకపోవడానికి ఆరోగ్య సూత్రాలు ఎంతో అవాసరం ప్రతి ఒక విద్యార్థిని విద్యార్థులు చదువుతోపాటు ఆటపాటల యందు నైపుణ్యత తీసుకురావడం కోసం ఎంతో క అవగాహన సరస్సు నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమంలో పేరెంట్స్ కమిటీ కంబాలపల్లి భాస్కర్, ప్రైమరీ స్కూల్ హెచ్ఎం మోహన్ గౌడ్, హెల్త్ వెంకట్ రెడ్డి, కళావతి, పాల్గొన్న టీచర్స్ కంబాలపల్లి శ్రీకాంత్,రమేష్,హాథిరాం,చిన్నికృష్ణ, కరుణాకర్ రెడ్డి, శ్రీలత, రజిని, అలివేలు.ఆశ వర్కర్లు అమృత, అవివేలు, పుష్పలతతదితరులు పాల్గొన్నారు

## గౌడ సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో ఎక్సైజ్ ఈఎస్ కు సన్మానం




**,తొవ్వ ,వరంగల్ టౌన్, ,నవంబర్ 18:**

గౌడ సంఘాల జేఏసీ అ ద్వ ర్య ం లో హనుమకొండ జిల్లా ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ జిల్లా అధికారి చంద్రశేఖర్ ను శాలువతో మంగళవారం ఘనంగా సన్మానం చేశారు. అనంతరంగీతా కార్మికుల సమస్యలపై గౌడ సంఘాల జేఏ సీ నేతలు ఆయనకువినతి పత్రం అందించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గత రెండు సంవత్సరాల నుంచి గీతా కార్మికులకు రావలసిన ఎక్స్గ్రేషియా వెంటనే ఇవ్వాలని, తాటి చెట్టు ఎక్కే ప్రతి గీతా కార్మికులకు సభ్యతాలు వెంటనే ఇవ్వాలని, వాటితో పాటుగా సేఫ్టీ మోకులు అందించాలని , తాటి చెట్లను ఈత చెట్లను నరికే వారిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవలని నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేయాలని సొసైటీలకు ఐదు ఎకరాల భూమిని ప్రభుత్వం కొనివ్వాలని ప్రధాన డిమాండ్లపైఅ అధికారులు చొరవ చూపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం జేఏసీ నేతలు పట్టాపురం ఏకాంతం గౌడ్, తీగల లక్ష్మణ్ గౌడ్, జనగాం వెంకటేశ్వర్లు గౌడ్, అనంతుల రమేష్ గౌడ్,హనుమకొండ జిల్లా నాయకులు బత్తిని వెంకటేశ్వర్లు గౌడ్, మార్కా రవీందర్ గౌడ్, శీలం కర్ణాకర్ గౌడ్, తాళ్ల పెల్లి రమేష్ గౌడ్, చిర్రా వెంకట స్వామి గౌడ్, తాళ్లపల్లి వెంకటేశ్వర్లు గౌడ్, నాలం సంపత్ గౌడ్, ఆరెల్లి రాముగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ కార్పొరేషన్ కు 1000 కోట్లు కేటాయించాలి

### ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు కుక్కల ఐలయ్య ముదిరాజ్

**తొవ్వ, నెల్లికుదురు, నవంబర్ 18**



రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ముదిరాజ్ కార్పొరేషన్ కు 1000 కోట్లు కేటాయించి ముదిరాజ్ లను ఆర్థికంగా ఆదుకోవాలని ముదిరాజ్ మహాసభ మండల అధ్యక్షులు కుక్కల ఐలయ్యముదిరాజ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో ముదిరాజ్ మహాసభ నేతలతో కలిసి ఈనెల 21న నిర్వహించే ముదిరాజ్ మహాసభ వార్షికోత్సవం సందర్భంగా ముదిరాజ్ జెండా ఆవిష్కరణ వాల్ పోస్టర్ నుఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముదిరాజ్, తో పాటు ఉప కులాలకు చెరువులపై పూర్తి అధికారాలు కల్పించే విధంగా ఉన్న జీవోలను అమలు చేయాలని, మత్స్య శాఖకు 3000 కోట్లు కేటాయించి మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలకు నిధులు విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం మత్స్యశాఖ కార్పొరేషన్ ఏర్పాటు చేయడం పట్ల ప్రభుత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. 21న జరిగే జెండా ఆవిష్కరణకు మండలంలోని ముదిరాజులంతా తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ మహాసభ నేతలు తోట రమేష్, నారబోయిన మల్లయ్య, తోట సురేష్ తదితరులున్నారు.

## వ్యాసరచన , చిత్రలేఖనం పోటీలు సృజనాత్మకతను వెలికి తీయడానికి దోహదపడతాయి



**తొవ్వ ,ప్రతినిధి , నవంబర్ 18:**

మహబూబాబాద్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం హై స్కూల్ స్థాయి 9వ తరగతి మరియు పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులకు. లైబ్రరీస్ ది హార్ట్ ఆఫ్ నాలెడ్జ్ అనే అంశంపై వ్యాస రచన పోటీ అదేవిధంగా ఏడవ తరగతి మరియు ఎనిమిదవ తరగతి విద్యార్థుల విద్యార్థులకు చిత్రలేఖనం పోటీ నిర్వహించడం జరిగింది 300 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి న్యాయ నిర్ణయితగా విచ్చేసిన రిటైర్డ్ డ్రాయింగ్ మాస్టర్ పింగళి శ్రీనివాసరావు గారు మాట్లాడుతూ సృజనాత్మకతను వెలికి తీయడానికి వ్యాసరచన మరియు చిత్రలేఖనం లాంటి పోటీలు దోహదపడతాయని అన్నారు. ఒక మనిషి ఓడిపోతే ఇతరులు గేలి చేస్తారు కానీ పుస్తకాలు ఓదారుస్తాయి కావున చదివే అలవాటును పెంపొందించుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి టి శ్రీలత, గ్రంథపాలకులు జీ విజేందర్ ,సిహెచ్ రవి, రుద్రారపు వీరేందర్, బి భూలక్ష్మి ,బి యాదమ్మ వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు జంపాల నారాయణ శ్రీధర్, ఎండి సత్తార్, సయ్యద్ రషీద్,వెల్ది జయ్ ,ప్రవీణ్ గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు



## గోవిజ్ఞాన్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలకు బహుమతులు పంపిణీ.

### -గోవిజ్ఞాన్ జిల్లా నాయకులు కందాల కృష్ణ మూర్తి.



బయ్యారం,తోవ్వ,నవంబర్ 18.

మండలంలోని గోవిజ్ఞాన్ గో సంరక్షణ దానిపై రాష్ట్ర గోసంరక్షణ సమితి సభ్యులు,రాష్ట్ర జిల్లా మండల స్థాయి గోవిజ్ఞాన పరీక్షలను ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల విద్యార్థిని విద్యార్థుల నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికి బహుమతుల ప్రధానం చేశారు.దీనిలో భాగంగా మంగళవారం బయ్యారం మండలంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రథమ,ద్వితీయ, తృతీయ బహుమతులను విద్యార్థినీలకు మండల గోసంరక్షణ నాయకులు బిజ్జ కనకయ్య ఆధ్వర్యంలో గోసంరక్షణ జిల్లా నాయకులు కందాల గోపికృష్ణ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ గోవు విశిష్టత వాటి ప్రాధాన్యతను భారతీయ సంస్కృతి సాంప్రదాయాలకు నిలువెత్తు నిదర్శనం గోవు అని,అమ్మలాంటి గోవును అమ్ముకోవద్దని,గోహింస చేయవద్దని,గోవు అన్ని విధాల మనిషి మానవ మనుగడను ప్రభావితం చేస్తుందని,ఇంటింటికి గోవు ఉన్నప్పుడే సమాజం,ధరణి సుభిక్షంగా ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వన్నం బాబురావు, తుమ్మల శ్రీనివాస్,ఇంద్రారెడ్డి,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



# పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

## ప్రత్యేక అధికారి జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న.



తొవ్వ, నెల్లికుదురు నవంబర్.18

పది విద్యనభ్యసిస్తున్న విద్యార్థినీ విద్యార్థులు 100% ఉత్తీర్ణత సాధించి జిల్లాలో నే మండలాన్ని ప్రథమ స్థానంలో నిలపాలని మండల ప్రత్యేక అధికారి, పట్టు పరిశ్రమ, ఉద్యానవన శాఖ జిల్లా అధికారి జినుగా మరియన్న విద్యార్థులకు సూచించారు. మంగళవారంజిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాలు ప్రకారం ఆయన మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను, తెలంగాణ మోడల్ స్కూల్ , షెడ్యూల్డ్ కులాల వసతి గృహాలను స్థానిక తహసిల్దార్ సిహెచ్.నరేష్, కస్తూరిబా ప్రిన్సిపాల్ ఇల్లందులసుమలత, డా.రమ్య తదితరులతో కలిసి సందర్శించారు.ఈ సందర్శనలో అధికారులు విద్యార్థులతో కలిసి భోజనం చేసి, పాఠశాలలో అందిస్తున్న విద్యా, వసతి, భోజన సదుపాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి విద్యార్థులను ఆత్మవిశ్వాసంతో చదువులో ముందుకు సాగాలని ప్రోత్సహించారు. అలాగే మానసిక ఆరోగ్య, క్రీడలు, వ్యాయామం లాంటి తదితర అంశాలపై కూడా విద్యార్థులకు నిత్య అవగాహన చేయాలని తెలిపారు.అదేవిధంగా, అధికారులు విద్యార్థులు మరియు సిబ్బందికి చలి కాలంలో వ్యాధులు ప్రబలకుండా నీటి పరిశుభ్రత పాటించడం, పాఠశాలలో నీరు నిల్వ ఉండనివ్వకపోవడం, దోమల నివారణ చర్యలు తీసుకోవడం, శుభ్రమైన ఆహారం తీసుకోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం వంటి జాగాత్తలు పాటించాలని సూచించారు.డెంగ్యూ, మలేరియా, వైరల్ ఫీవర్, విరేచనాలు, టైఫాయిడ్ వంటి వ్యాధులు నివారించవచ్చని విద్యార్థులకు వివరించారు.అలాగే, జ్వరం, వాంతులు, విరేచనాలు వంటి లక్షణాలు కనపడితే వెంటనే ప్రభుత్వ వైద్యశాలను సంప్రదించాలని, స్వీయచికిత్స చేయరాదని అధికారులకు సూచించారు.

# ఏకలవ్య మోడల్ స్కూల్ తనిఖీ చేసిన ఎంపిడిఓ దీపిక.



బయ్యారం,తోవ్వ,నవంబర్ 18.

మండలంలో హాస్టల్స్ మెనూ ప్రకారం అమలుపై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు మంగళవారం ఏకలవ్య మోడల్ స్కూల్ ను ఎంపిడిఓ దీపిక తనిఖీ చేశారు.పాఠశాలలోని తరగతి గదులు పరిశీలించి విద్యార్థినీల సమస్యల గురించి ఆర తీశారు.హాస్టల్లో ఉన్న వంటగదిని,వంట సరుకుల,స్టోర్ రూమ్ ను పరిశీలించారు.ఈ సందర్భంగా వంట సరుకుల వంట నాణ్యతను, విద్యార్థులు భోజన హాలును పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు ఇచ్చారు.నాణ్యతలేని సరుకులను వంటకు ఉపయోగించొద్దని నూతన మెనూ ప్రకారమే భోజనం నిర్వహిస్తున్నారా లేదా అని విద్యార్థులను వంట చేసే నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు.భోజనసమయంలో విద్యార్థులతో భోజనం నాణ్యత గురించి తెలుసుకున్నారు. హాస్టల్ గదులు చుట్టూ ఉన్న పరిసరాలను కూడా ఎప్పటికప్పుడు శు భ్రంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.పాఠశాల తనిఖీలో ప్రిన్సిపాల్ అశోక్, పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుండి 4 రోజుల పాటు సిపిఐ బస్సు జాత

## భారత గడ్డపై సిపిఐ కు వందేళ్ళు

యాదాద్రి జిల్లా: భువనగిరి: తొవ్వ ప్రతినిధి: నవంబర్ 18

1925 డిసెంబర్ 26న కాన్పూర్ లో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) భారత గడ్డపై వందేళ్లు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26న ఖమ్మంలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నామని ఈ భారీ బహిరంగ సభను జయప్రదం చేయడానికి ఈనెల 19 ,20, 21 ,22 తేదీలలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని మండలాల్లో సిపిఐ రాష్ట్ర వ్యాప్త బస్సు యాత్ర ప్రచారం చేయనుందని సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి తెలిపారు.మంగళవారం రోజున భువనగిరిలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో జిల్లా పార్టీ సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎండీ ఇమ్రాన్ తో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో దామోదర్ రెడ్డి మాట్లాడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ ఎన్నో నిర్బంధాలను ఎదుర్కొని స్వాతంత్ర ఉద్యమంలో అగ్ర బాగాన నిలబడి పోరాటం చేసిందని మరియు ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రత్యక్ష ఆందోళనలో పాల్గొని రాష్ట్ర%శీ% సాధించేవరకు పోరాటం చేసిందని, భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి నుండి విముక్తి కోసం పోరాటాలు నిర్వహించిన చరిత్ర భారత కమ్యూనిస్టు పార్టీదని, 4వేల కమ్యూనిస్టుల బలిదానం తో 10 లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచిన చరిత్ర అని గుర్తు చేశారు.ఈ దేశంలో కార్మికుల,విద్యార్థుల, రైతుల, మహిళల, సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పోరాటాలు చేస్తున్నదని అయన అన్నారు. డిసెంబర్ 26న ఖమ్మంలో జరుగు సిపిఐ (100 సంవత్సరాల) శతజయంతి ఉత్సవాల ముగింపు బహిరంగను జయప్రదం చేయడానికి రాష్ట్ర పార్టీ ఆధ్వర్యంలో బాసర నుండి ప్రారంభమైన బస్సు జాత రేపు 19న జిల్లాలోని నారాయణపురం, చౌటుప్పల్ మండలంలో, 20న బీబీనగర్,భువనగిరి, 21న వలిగొండ మోత్కూరు గుండాల ఆత్మకూర్ మోటకొండూర్ యాదగిరిగుట్టలో 22న రాజపేట మరియు ఆలేరులో బస్సు యాత్ర ప్రచారం చేయనుందని ఈ బస్సు జాతకు జిల్లాలోని పార్టీ సభ్యులు, సానుభూతి పరులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని డప్పులు మరియు కళాకారులతో ఘన స్వాగతం పలకాలని దామోదర్ రెడ్డి పిలుపునిచ్చారు.

## ఐద్వా జాతీయ మహాసభ ల కరపత్రాలు ఆవిష్కరణ




తొవ్వ, గార్ల నవంబర్ 18:

జనవరి 25-28 తేదీలలో హైదరాబాద్ లో జరగనున్న ఐద్వా జాతీయ మహాసభ లను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు కందునూరి కవితా పిలుపునిచ్చారు.గార్ల మండల కేంద్రంలో స్థానిక మంగపతి రావు భవనం లో తాళ్లపల్లి రామా అధ్యక్షతన జరిగిన ఐద్వా మండల కమిటీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు.ఈ సమావేశంలో జిల్లా నాయకురాలు అలవాల సత్యవతి, మండల కార్యదర్శి మల్లెల నాగమణి, నాయకులు కె.సుజాత, బి.లక్ష్మీ, నాగమణి, ఉమావతి,కవితా, ఈశ్వరమ్మ,పద్మ తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షాన జాతీయ మాలమహానాడు




తొవ్వ ,తోఉురు .నవంబర్ 12:

తొర్రూర్ పట్టణ కేంద్రంలో గత కొద్దిరోజులుగా సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో గత ప్రభుత్వంలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్లు కేటాయించాలని చేస్తున్న నిరసన దీక్షలకు జాతీయ మాలమహానాడు మహబూబాబాద్ జిల్లా పక్షాన మద్దతు ప్రకటించడం జరిగినదిఈ కార్యక్రమంలో మాలమహానాడు జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్ గారు మరియు రాష్ట్ర పొలిట్ బ్యూరో సభ్యులు జిల్లా ఇంచార్జ్ చిట్టిమల్ల సమ్మయ్య జిల్లా అధ్యక్షులు చిట్టిమల్ల మహేష్ పాల్గొని మద్దత్తు ప్రకటించడం జరిగినది ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు బొల్లం అశోక్ మండల కార్యదర్శి యాకుబ్ పట్టణ కార్యదర్శి యాకన్నా మాలమహానాడు నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి ఎనమాల రాకేష్ డివిజన్ అధ్యక్షులు గొడిశాల నవీన్ మండల అధ్యక్షులు అనపర్తి నగేష్ నెల్లికుదురు మండల అధ్యక్షులు కారం ప్రశాంత్ సీనియర్ నాయకులు ఎనమాల అంజయ్య గంపల ప్రవీణ్ కుమార్ వెంకటేశ్వర్లు నూనె ప్రవీణ్ పాల్గొని మద్దత్తు ప్రకటించడం జరిగినట

## స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి .రాణా ప్రతాప్ రెడ్డి.



**నల్లబెల్లి, నవంబర్ 18, తొవ్వ న్యూస్:**

నల్లబెల్లి మండల పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు తడుక వినయ్ గౌడ్ అధ్యక్షతన బూత్ అధ్యక్షుల సమావేశం నిర్వహించడం జరిగింది.ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డా.గోగుల రాణా ప్రతాప్రెడ్డి విచ్చేసిమాట్లాడుతూరాబోయే స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని అధిక స్థానాల్లో గెలిచే విదంగా ప్రణాళికలు సిద్ధంచేసుకోవాలన్నారు.గ్రామాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధుల గురించి ఇంటికి తిరిగి ప్రజలకు వివరించాలని దిశానిర్దేశంచేశారు.ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు పెరుమాండ్ల కోటి , నాగిరెడ్డి రాజిరెడ్డి మండల పార్టీ ప్రధాన కార్యదర్శులుఈర్లనాగరాజు ,గుగులోతు తిరుపతి మండల ఉపాధ్యక్షుల ఎబత్తిని కుమారస్వామి , గుర్రపు నరేష్ సింగిరెడ్డి యాదగిరి భూక్యా మైభూ , మండల కార్యదర్శులు మర్రినాగరాజు ,బూరకృష్ణ ,పున్నం కృష్ణ మూర్తి కోశాధికారి మురికి మనోహర్ తో పాటు బూత్ అధ్యక్షులుపాల్గొన్నారు.

## బయ్యారం మండల కేంద్రంలో మాదక ద్రవ్యాల నిర్మూలన ప్రతిజ్ఞ.

### -సీఐ రవి కుమార్.



బయ్యారం,తోవ్వ,నవంబర్ 18.

యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని గార్ల బయ్యారం సీఐ రవి కుమార్ అన్నారు.పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం బయ్యారం మండల కేంద్రంలోని గాంధీ సెంటర్ సర్కిల్ రహదారి పై నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మాదక ద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ విద్యార్థులు,యువత బంగారు భవిష్యత్తును మాదక ద్రవ్యాలు నాశనం చేస్తున్నాయన్నారు.25 ఏళ్లలోపు యువతే అధికంగా మత్తుకు బానిసలు అవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.అనంతరం విద్యార్థులకు,యువతీ యువకులు,మండల ప్రజలకు మాదక ద్రవ్యాల వినియోగంతో కలిగే దుష్ప్రభావాలపై ఎస్ఐలు తిరుపతి,మైబుభి అవగాహన కల్పించారు.మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేయించారు.ఈ కార్యక్రమంలో తహశీల్దార్ నాగరాజు, ఎంపీడీవో దీపిక,యంఈఓ దేవేంద్ర చారి, ఉపాధ్యాయులు,విద్యార్థులు,పోలీస్, రెవెన్యూ,పంచాయతీ సెక్రటరీ లు తదితరులు పాల్గొన్నారు.

## వెన్నెల చిల్డ్రన్స్ హాస్పిటల్ లో అత్యున్నత వైద్యసేవలు.

### -డాక్టర్ సుధీర్ రెడ్డి.



**బయ్యారం,తోవ్వ,నవంబర్ 18.**

పిల్లలు,మహిళలకు జిల్లాలోనే అత్యున్నత వైద్యసేవలు వెన్నెల చిల్డ్రన్స్ హాస్పిటల్ అందిస్తున్నదని వెన్నెల చిల్డ్రన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ పెద్ది సుధీర్ రెడ్డి అన్నారు. మంగళవారం బయ్యారం ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని సందర్శించి జర్నలిస్ట్ ప్రతినిధులను కలిసి ఆరోగ్యసమస్యలపై ముచ్చటించారు.ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో హాస్పిటల్ ప్రారంభించి 100 రోజులు అయిందని అన్నారు.ఆసుపత్రి లో పీడియాట్రిక్ మల్టీస్పెషాలిటీ (శిశు సంరక్షణ), పెరినాటల్ కేర్ (గర్భిణి వైద్య సేవలు)వెన్నెల చిల్డ్రన్స్ అత్యుత్తమ వైద్య సేవలను విస్తరించడంలో మహబూబాబాద్ పట్టణంలో నమ్మకమైన వైద్యసేవలను అందిస్తున్నదాని,ఈ నూతన సౌకర్యాలను,అధునాతన పీడియాట్రిక్,నియోనాటల్,మండల ప్రజలు మా సేవలను ఉపయోగించుకోవాలని కోరారు.ప్రధానంగా పిల్లలు, మహిళలకు 24/7 గంటలు అత్యవసర సేవలు అందించనున్నట్లు తెలిపారు. మా ఆసుపత్రి లో డైరెక్టర్ డాక్టర్ జోష్నా రెడ్డి మా హాస్పిటల్ ఎల్లప్పుడూ మహిళలు, పిల్లల సంరక్షణలో అత్యున్నత ప్రమాణాలకు సేవలకు కట్టుబడి ఉందని,వైద్య ప్రమాణాలు మరింత బలోపేతం చేయడానికి తోడ్పాటును అందిస్తుంది అని తెలిపారు. కార్పోరేట్ వైద్యం లా జిల్లా లో వెన్నెల ఆసుపత్రి సామాన్య ప్రజలకు ఉన్నతమైన వైద్య సేవలు అందించడానికి వీలు కల్పిస్తుందన్నారు.

# ఇచ్చిన హామీలు ఒక్కటైనా నెరవేర్చారా..

## - కాంగ్రెస్ పాలనలో కాంటా,కరెంటు కష్టాలా...?






## - మాజీ మంత్రి హరీష్ రావు.

**కేసముద్రం,నవంబర్ 18,తొవ్వ:**
వరంగల్ డిక్లరేషన్ లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఒక్క హామీనైనా నెరవేర్చిందా అని బిఆర్ఎస్ మాజీమంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు ప్రశ్నించారు. మంగళవారం కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ని సందర్శించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.... పత్తి రైతులతో మాట్లాడి ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైందన్నారు. కాంగ్రెస్ పాలనలో కరెంటు నుంచి కాంటా వరకు అన్ని సమస్యలేనని విమర్శించారు. సమయానికి ఎరువులు అందక,కరెంటు సరిగ్గా రాక, రైతుబంధు రుణమాఫీ చేయక,బోనస్ ఊసే ఎత్తక రైతులను దగా చేశారని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా మేలుకోకపోతే తెల్ల బంగారాన్ని తీసుకొచ్చి జూబ్లీహిల్స్ ప్యాలెస్ ముందు పోస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు 60 సార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎంకు పత్తి రైతుల పరిస్థితిపై కేంద్రానికి విన్నవించే అవకాశం రాలేదా అని ప్రశ్నించారు. ఉప ఎన్నికలలో గెలిచేందుకు విచ్చలవిడిగా డబ్బులు పంచిన రేవంత్ రెడ్డి రైతులకు మద్దతు ధర కల్పించలేకపోతున్నారా అని దుయ్యబట్టారు. ఎల్ వన్,ఎల్ టు,ఎల్ త్రీ విధానం కపాస్ యాప్ లో 8-12 శాతం ఉండాలన్న నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిట్టుబాటు ధరలపై పత్తి రైతులకు అరచేతిలో వైకుంఠం చేతల్లో నరకం చూపిస్తున్నారని విమర్శించారు. గత సంవత్సరం మాదిరిగానే 12 క్వింటాల పత్తిని కొని రైతులను ఆదుకోవాలని అన్నారు.లేకుంటే రాష్ట్ర ప్రభుత్వం మెడలు వంచి ప్రజాక్షేత్రంలో తేల్చుకుంటామని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వద్దిరాజు రవిచంద్ర,తక్కెళ్లపల్లి రవీందర్ రావు,సత్యవతి రాథోడ్, రెడ్యానాయక్,మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్,రాకేష్ రెడ్డి, నీలం దుర్గేష్,రావుల శ్రీనాథ్ రెడ్డి,ఊకంటి యాకూబ్ రెడ్డి,రావుల రవిచంద్ర రెడ్డి,నజీర్ అహ్మద్,కముటం శ్రీను,కొండ్రెడ్డి రవీందర్ రెడ్డి, సట్ల వెంకన్న, ఘనపారపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టు కుటుంభానికి అండగా ఉంటానని హామీ ఇచ్చిన జాగృతి అధ్యక్షురాలు

**తొవ్వ ఖమ్మం ,నవంబర్ 18:**
డోర్నకల్ మండల దిశ జర్నలిస్ట్ రామకృష్ణ సతీమణి రాధ ఇటీవల జరిగిన రోడ్డుప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఖమ్మంలోని ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుందగా విషయం తెలుసుకున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఖమ్మం ఆసుపత్రికి వచ్చి పరామర్శించారు. అనంతరం వైద్యులతో, ఆసుపత్రి యాజమాన్యంతో మాట్లాడారు.నిరుపేద జర్నలిస్ట్ కుటుంబానికి పెద్ద ఆపద వచ్చిందని, మెరుగైన వైద్యం అందించాలని, ఆర్థికభారం ఆ.. కుటుంబంపై





పడకుండా సహకరించాలని కోరారు.తన వంతుగా జాగృతి అండగా వుంటున్నదని హామీ ఇచ్చారు

## డ్రగ్స్.లేని సమాజాన్ని తీర్చిదిద్దాలి.

### మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి.

**ఖానాపూర్, నవంబర్ 18, తొవ్వ న్యూస్:**
ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జ్యోతి ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల అం జాతీయ ఆరోగ్య కార్యక్రమంలో భాగంగాఈరోజురాష్ట్రవ్యాప్తంగామాదకద్రవ్యాలదుర్వినియోగంలేదామాదకద్రవ్యాలవ్యసనం నుండి విముక్తి కల్పించే అవగాహన కార్యక్రమం మీద ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జ్యోతి మాట్లాడుతూ నషా భారత్ అభియాన్ అనేది డ్రగ్ ఫ్రీఇండియానుసాధించడం కోసంకేంద్రప్రభుత్వంతీసుకువచ్చిన ఒక జాతీయ కార్యక్రమం ఇందులోఉన్నతవిద్యాసంస్థలుయూత్ క్లబ్బులు ,మహిళా సంఘాలు,మరియుయువతను మహిళలను కమ్యూనిటీ సభ్యులను చైతన్యపరిచి డ్రగ్స్ లేని సమాజాన్ని నిర్మించడం కోసం ఒక కార్యక్రమం చేపట్టింది అందులో భాగంగా నవంబర్ 18న తెలంగాణ రాష్ట్రం కూడా మాదకద్రవ్యాలులేనితెలంగాణ సాధించడం కోసం ప్రజల్లో అవగాహన



కల్పించడం కోసం ఒక ప్రతిజ్ఞ చేయించడం జరిగింది.మీడియాలో ,సోషల్మీడియాలో కూడా డ్రగ్స్ లేనితెలంగాణ సాధించడం కోసం ప్రజల్లో యువతలో అవగాహన కల్పించడమే ఈ యొక్క కార్యక్రమం ఉద్దేశం. యువత నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని మాదకద్రవ్యాల మత్తులో జీవితాలు పాడు చేసుకోవద్దని ప్రస్తుతం గంజాయి బ్రౌన్ షుగర్ హెరాయిన్, చెర్రీస్ తదితర మాదకద్రవ్యాలకు బానిసలై కొంతమంది యువత తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారనికేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖ మరియు తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్ రహిత దేశంరాష్ట్రంగా మారాలంటే డ్రగ్స్ మీద అవగాహన పెంచుకోవాలని అందుకోసమేప్రతిజ్ఞచేయించడం అయినదని తెలిపారు. ఈ కార్యక్రమంలోపల్లె డాక్టర్లు డాక్టర్ కల్పనడాక్టర్ సునీత నర్సింగ్ ఆఫీసర్స్ చిన్ని, హేమలత, సబిత ఫార్మసీ ఆఫీసర్ శ్రీనివాస చారి హెల్త్ సూపర్వైజర్ దేవికా హెల్త్ అసిస్టెంట్ లుగొడిశాల భాస్కర్,విజయ,వినోద మోక్ష మేరీ,సునీత,సుజాత, రజిత, రమ్య హరికిషన్ ఆశాలు సంధ్యచిట్టి ,శ్రీలత , మొదలగు వారు పాల్గొన్నారు

## గార్ల లో మాదకద్రవ్య వ్యతిరేక ప్రతిజ్ఞ

**తొవ్వ గార్ల నవంబర్ 18:**



రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు,నషా ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పోలీసు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల వ్యతిరేక ప్రతిజ్ఞను నిర్వహించారు.గార్ల మండల కేంద్రంలో స్థానిక నెహ్రూ సెంటర్ లో మత్తు పదార్థాల వల్ల కలిగే హానికర ప్రభావాలపై పోలీసు, రెవెన్యూ అధికారులు అవగాహన కల్పించారు.అలాగే మాదకద్రవ్యాలకు వ్యతిరేక ఉద్యమంలో క్రియాశీల భాగస్వాములు మౌతామని, మాదకద్రవ్యాల బారిన పడకుండా వాటికి వ్యతిరేకంగా పోరాడుతామని ప్రతిజ్ఞ చేశారు

## ఇర్సులాపురం హాస్టల్ తనిఖీ చేసిన తహశీల్దార్.



బయ్యారం,తోవ్వ,నవంబర్ 18.
మండలంలో హాస్టల్స్ మెనూ ప్రకారం అమలుపై జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్ ఆదేశాల మేరకు బుధవారం ఇర్సులాపురం ఆశ్రమ పాఠశాల హాస్టల్ ను మండల తహశీల్దార్ నాగరాజు మంగళవారం తనిఖీ చేశారు.హాస్టల్లో ఉన్న వంటగదిని, వంట సరుకుల,స్టోర్ రూమ్ ను ఆయన పరిశీలించారు.ఈ సందర్భంగా వంట సరుకుల నాణ్యతను, విద్యార్థులు భోజనం చేసే హాలును పరిశీలించి వంట చేసే నిర్వాహకులకు తగు సూచనలు ఇచ్చారు.నాణ్యతలేని సరుకులను వంటకు ఉపయోగించొద్దని నూతన మెనూ ప్రకారమే భోజనం నిర్వహిస్తున్నారా లేదా అని విద్యార్థులను వంట చేసే నిర్వాహకులను ఆయన అడిగి తెలుసుకున్నారు.భోజన సమయంలో విద్యార్థులతో కలిసి తహశీల్దార్ భోజనం చేశారు.అదే విధంగా హాస్టల్ గదులు చుట్టూ ఉన్న పరిసరాలను కూడా ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శోభన్ బాబు, హాస్టల్ వార్డెన్ లాలయ్య,పిడి వాలు తదితరులు పాల్గొన్నారు.

## సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో క్రాఫ్ట్ వర్క్ షాప్

**తొవ్వ హనుమకొండ ,నవంబర్ 18:**



హనుమకొండ జిల్లా కి చెందిన సాగంటీస్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 23 ఆదివారం రోజు ఉదయం 9-11 గంటల వరకు మాస్టర్జీ హై స్కూల్, కిషన్ పుర, హనుమకొండ లో నర్సరీ నుండి పదవ తరగతి చిన్నారుల వరకు క్రాఫ్ట్ వర్క్ షాప్ నిర్వహిస్తూ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ మంజుల సాగంటి ఒక ప్రకటనలో తెలిపారు... రెండు గంటల వ్యవధి లో 4 విభాగాలుగా వర్క్ షాప్ నిర్వహిస్తున్నామని, పాల్గొన్న అందరికీ మెరిట్ సర్టిఫికెట్స్, మెడల్స్, చక్కని ప్రతిభ చూపించిన వారికి ప్రత్యేక బహుమతులు అందిస్తున్నామని, చిన్నారులలో దాగున్న సృజనాత్మకత వెలికి తీయడానికి ఈ వర్క్ షాప్ నిర్వహిస్తున్నట్లుగా ఆమె తెలిపారు. ఇతర వివరాలకు 8143643337 లో సంప్రదించవచ్చని అన్నారు..

## గోర్ మళావ్, సద్గురు సేవాలాల్ బోగ్ బండారో

**తొవ్వ ,మహబూబాబాద్ , నవంబర్ 18:**
గోర్ మళావ్, సద్గురు సేవాలాల్ బోగ్ బండారో, మళాన్ మండేరో కార్యక్రమంలో ఈ నేల24,25 మహారాష్ట్ర లోని పురియఘడ్ జరగబోయే రెండు రోజుల సమావేశానికి దేశంలోని అన్ని రాష్ట్రాల గోర్ ప్రజానీకం అందరు అధిక మొత్తంలో తరలిపోవలని గోర్ సేన కమిటీ రాష్ట్ర కోశాధికారి బిచ్చు నాయక్ చౌహన్, మరియు మానుకోట జిల్లా అధ్యక్షులు జి. ధనుంజయ నాయక్ కరపత్రాలతో పిలుపునిచ్చారు

# జిల్లాలో వనరులు పుష్కలం

## సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధిద్దాం

### వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య




**తొవ్వ ,ప్రతినిధి,నవంబర్ 09:**
జిల్లాలో వనరులు పుష్కలం సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధిద్దాం అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్యఅన్నారు . భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఐడిఓసి కార్యాలయంలో మంగళవారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అధ్యక్షతన జరిగిన దిశా కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై నిరంతర పర్యవేక్షణ చేయాలని జిల్లాలో వనరులు పుష్కలంగా ఉన్నాయని సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని సూచించారు. జిల్లా విద్యా హబ్ గా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. వైద్య సేవలపై సమీక్షించిన చైర్మన్ 45 శాతం ఆపరేషన్లు, 55 శాతం సాధారణ ప్రసవాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రసూతి వైద్యులు నియామకానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. డయాబెటిస్, హైపర్ టెన్షన్, కాన్సర్ స్క్రీనింగ్ పకడ్బందీగా జరగాలని స్పష్టం చేశారు. వ్యాధులు గుర్తించిన వారికి నాణ్యమైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. మలేరియా సోకకుండా ముందస్తు పరీక్షలు చేయాలని అన్నారు. రాష్ట్రంలో జిల్లా మొదటి స్థానంలో ఉన్నందుకు వైద్య సేవలను అభినందించారు. డయాలసిస్ సేవలు జిల్లా ప్రధాన ఆసుపత్రిలో అందుబాటులోకి తేవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన నిధులను సద్వినియోగం చేయాలని, జాప్యం వల్ల నిధులు వాపసు వెళ్లే అవకాశం ఉందని, 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు 12 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు స్థల సమస్య ఉందని తెలుపగా ఎందుకు జాప్యం జరుగుతోందని ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. భూపాలపల్లి ప్రాంతం బాగా అభివృద్ధి కావాలని పథకాలు అన్ని అమలు అయ్యేలా చూస్తున్నామని పర్యవేక్షణ లోపం వల్ల జాప్యం జరుగుతోందని అన్నారు. చిన్నారులకు ఆర్టిజం పరీక్షలు నిర్వహించాలని, అంగన్ వాడి సిబ్బందికి అవగహన కల్పించాలని సూచించారు.జిల్లాలో 431 పాఠశాలలున్నాయని, 14208 విద్యార్థులున్నారని తెలిపారు. పిఎం శ్రీ 8 పాఠశాలలు ఉన్నాయని, నూతనంగా ఒక పాఠశాలకు ప్రతి పాదనలు పంపినట్లు తెలిపారు. పిఎం శ్రీ వివరాలు నోట్స్ లో పెట్టాలని తెలిపారు. 12 భవిత కేంద్రాల్లో 60 మంది విద్యార్థులు ఉన్నారని డీఈఓ చెప్పిన సమాచారం మేరకు ఎలాంటి సేవలు అందిస్తున్నారని ఎంపీ ప్రశ్నించారు. డీఈఓ సమగ్ర సమాచారం అందించకపోవడంతో ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సారి సమగ్ర సమాచారంతో రావాలన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, గ్రంధాల య సంస్థ చైర్మన్ రాజబాబు, డిఆర్డీఓ బాలకృష్ణ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, కెటిపిపి సీఈ శ్రీ ప్రకాష్, సింగరేణి జిఎం రాజేశ్వర రెడ్డి, అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.ఖ




# పారీ పెడుతాం

## రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తాం

**తుమ్మల లాంటి సీనియర్లు పార్టీ వీడటం తో బి ఆర్ ఎస్ కు ఈ పరిస్థితి**

**తనను కుట్ర చేసి పార్టీకి, కుటుంబానికి దూరం చేశారు..**

**నూతన పార్టీ ని మీడియా ముందే బాజాప్త ప్రకటిస్తా..**

**ఖమ్మం పర్యటనలో జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**



**తొవ్వ ,ఖమ్మం ప్రతినిధి ,నవంబర్ 19:**
మేము పారీ పెడుతాం రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తాం అని మీడియా ముందే బాజాప్త ప్రకటించి మా సత్తాచాటుతామని ఎవరికి భయపడేది లేదని మేము బాజాప్తా తెలంగాణ ప్రజల కోసం పనిచేస్తున్నామని బీఆర్ఎస్ తనను నిజామాబాద్ కే పరిమితం చేశారు.. అందుకే ఇప్పుడు రాష్ట్రమంతా తిరుగుతున్నాను.. జాగృతిని బలోపేతం చేస్తున్నానాని జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవితఅన్నారు ఖమ్మం జిల్లా పర్యటనలో భాగంగా నూతన పార్టీ పై స్పందిస్తూ ఏదో పార్టీ పెట్టామా? నడిపించామా అన్నట్లుగా మాత్రం చేయనని . పార్టీ పెట్టేది ఉంటే మాత్రం హైదరాబాద్లోప్రజలుమీడియా మధ్య ఢంకా బజాయించి ప్రకటిస్తాన్నారు .. తెలంగాణ ప్రజలకు వజ్రాయుధం లాంటి పార్టీని అందిస్తా'నని అన్నారు కానీ.. ఇప్పుడే ఆ పని చేయనని.. ముందు ముందు పరిస్థితులు చూసి నిర్ణయం తీసుకుంటానన్నారు. ప్రస్తుతం తనకు బీఆర్ఎస్ పార్టీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఫ్రెంచ్ విప్లవం, తెలంగాణ సాయుధ పోరాటం, తెలంగాణ మలి ఉద్యమం స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళు తున్నానని చెప్పారు. తుమ్మల నాగేశ్వర్రావు లాంటి సీనియర్ నేతలను వదులు కోవడంతోనే బీఆర్ఎస్ ఎన్నికల్లో ఓడిందన్నారు. సీనియర్ నేతలను వదులుకొని కేసీఆర్ తప్పిదం చేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ప్రతిపక్షా లైన బీఆర్ఎస్, బీజేపీ వైఫల్యాలతోనే కాంగ్రెస్ గెలిచిందన్నారు. జాగృతి జనం బాట కార్యక్ర మంతో అధికార, ప్రతిపక్షాలు నిద్ర లేస్తున్నా యన్నారు. '20 ఏళ్ల పనిచేసిన తనను కుట్ర చేసి పార్టీకి, కుటుంబానికి దూరం చేశారు.. అలాంటి వారి గురించి కచ్చితంగా మాట్లాడు తాను.. అస్సలు వదిలే ప్రసక్తే లేదు..' అని హాట్ కామెంట్స్ చేశారు. తాను చాలా ధైర్య వంతురాలిని.. ఆరు నెలలు జైల్లో పెట్టినా భయపడలేదన్నారు. వేరే వాళ్లయితే డిప్రెషన్తో ఇంటికే పరిమితమయ్యే వారని అన్నారు. తెలంగాణ ఆడబిడ్డలు రాజకీయాల్లోకి ధైర్యంగా రావాలనే వారి బరువును భుజానికి ఎత్తుకున్నానని చెప్పాం

# లక్కీ డ్రా నిర్వాహకుడిపై కేసు నమోదు

**మోసపూరిత ప్రకటనలు నమ్మి ప్రజలు మోసపోవద్దు**

**భిక్కనూరు సీఐ సంపత్ కుమార్**



తొవ్వ డెస్క్ ,నవంబర్ 17:
ఎటువంటి అనుమతులు లేకుండా లక్కీ డ్రా పేరు తో ప్రజలను మోసం చేసి అక్రమంగా డబ్బులు వసులు చేస్తున్న వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బిక్కనూరు సీఐ సంపత్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. రాజంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో బస్వన్న పల్లి గ్రామంలో పోలీసులు నిన్న ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్న సమ యంలో ప్రభుత్వ అనుమతి లేకుండా లక్కీ డ్రా / ల్యాండ్ సేల్ పేరుతో ప్రచారం చేస్తున్న గడ్డం రాజు (38) ను అదుపులోకి తీసుకున్నామని తెలి పారు. నిందితుడు తన సొంత వ్యవసాయ భూమి సర్వే నంబర్ 35/ఆ2/2 గల రెండు ఎకరాల 10 గుంటల భూమిని లక్కీ డ్రా సెల్ పేరుతో 500 టోకెన్లు జమ చేసి ఒక్క టోకెన్ 10000 రూపాయల చొప్పున 500 మంది నుండి డబ్బులు వసూలు చేయాలనే ఉద్దేశంతో కరపత్రాలు, వాట్సాప్ గ్రూప్ లలో ప్రచారం చేసినట్టు విచారణలో తేలిందనితెలిపారు. ఆదివారం నలుగురు వ్యక్తుల నుంచి పదివేల రూపాయల చొప్పున 40 వేలు జమ చేసి లక్కీ డ్రాలో నమోదైనట్టు పోలీసుల దర్యాప్తులో నిర్ధారణ అయిందని తెలిపారు. పోలీసులు అతని నుంచి లక్కీ డ్రా పాంప్లెట్స్, 500 టోకెన్ వివరా లతో ఉన్న బుక్లెట్, మొబైల్ ఫోన్ స్వాధీనం చేసుకు న్నట్టు తెలిపారు.







# కామ్రేడ్ మడావి హిడ్మా హత్య నేటి భారత బిర్సాముండా, మూలవాసుల హత్యే

## సీపీఐ ఎంఎల్ జనశక్తి, కేంద్ర కమిటీ సభ్యులు చంద్ర ప్రకాష్

తొవ్వ ,డెస్క్ , నవంబర్ 17:
జనవరి 1/2024 లో ప్రారంభమై గత 23 మాసాలుగా ఆర్.ఎస్.ఎస్, బీజేపీ బ్రాహ్మణీయ హిందుత్వ ఫాసిజం శక్తులు దేశీయఎర్ర టెర్రరిజం' అంతం పేరిట సాగిస్తున్న నరమేధకాండ వెర్రితలలు వేస్తుందని . అడ్డూ అదుపు లేకుండా మధ్య భారతాన్ని దహించివేస్తుందని . గత గోండ్వానా రాజ్యంలోని ప్రత్యేకంగా ఆదివాసులు, ఇతర పేదల రక్తాన్ని పారిస్తున్నది.అందులో భాగంగా ఇప్పటికే మావోయిస్ట్ పార్టీ ప్రధాన కార్యదర్శితో పాటు తొమ్మిది మంది కేంద్ర కమిటీ సభ్యులను పదులసంఖ్యలో రాష్ట్ర కమిటీ సభ్యులను, వందలాది మంది గెరిల్లా సైనికులను, కమాండర్లను, పోరాట యోధులను మరియు సామాన్య ఆదివాసులనుప్రాణాలను తోడేసిన కేంద్ర ప్రభుత్వ హెరీం మంత్రి అమిత్ షా ఒక నరమాంస భక్షకుడైనాడని సీపీఐ ఎంఎల్ జనశక్తి, కేంద్ర కమిటీ సభ్యులు చంద్ర ప్రకాష్ అన్నారు అయన కామ్రేడ్ మడావి హిడ్మామరణంపైనా స్పందిస్తూ లేఖను విడుదల చేశారు




భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు - లెనినిస్టు)- జనశక్తి
COMMUNIST PARTY OF INDIA (MARXIST - LENINIST) - JANASHAKTI
కేంద్ర కమిటీ
తేది: 18/11/2025
పత్రికా ప్రకటన





మాజీ మంత్రి శ్రీ తన్నీరు హరీష్ రావు ఘన స్వాగతం పలికిన వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు శ్రీ నన్నపునేని నరేందర్